


Truth of News

RNI NO : APTEL/25/A0239

సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 256 | ఆదివారం 08 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



బెంగాల్ పర్యటనలో
ప్రొటోకాల్ లోపాలు

- మమత సర్కార్‌పై రాష్ట్రపతి అసహనం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వ ప్రభుత్వంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. - మిగతా 2లో..

అమెరికా రాడార్ వ్యవస్థను
ధ్వంసం చేసిన ఇరాన్

- 300 మిలియన్ డాలర్ల నష్టం
- ఎక్కడా వెనక్కి తగ్గని టెహ్రాన్

వాషింగ్టన్ - సూర్య వాస్తవం :

ఇరాన్ జరిపిన దాడిలో గల్ఫ్‌లోని అమెరికాకు చెందిన కీలక రాడార్ వ్యవస్థ ధ్వంసమైంది. దీంతో అమెరికాకు 300 మిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. గల్ఫ్‌లోని అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థలకు ఈ రాడార్ సూచనలు అందిస్తుంటుంది. ఇరాన్ వైపు నుంచి గల్ఫ్ పైకి వచ్చే దాడులను ఎదుర్కోవాలంటే ఈ రాడార్ సాయం ఎంతో



అవసరమని అమెరికా అధికారి ఒకరు తెలిపారు. అమెరికాకు చెందిన థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉపయోగిస్తున్న రాడార్‌ను, దానికి సంబంధించిన - మిగతా 2లో..

అధిష్ఠానం అనుమతిస్తే ఇంకో
రెండు బడ్జెట్లు ప్రవేశపెడతా!

- అధిష్ఠానం నిర్ణయం మేరకే పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టీకరణ
- రాష్ట్రంలో ఇప్పటివరకు అత్యధికంగా 17 బడ్జెట్లు ప్రవేశపెట్టిన సిద్ధరామయ్య
- ప్రధాని మోదీ వచ్చాకే ఎల్పీజీ ధరలు పెరిగాయని మండిపాటు



2లో

హైదరాబాద్‌ను
క్లీన్ సిటీగా మార్చాలి

- ప్రతీరోజు చెత్త సేకరణ జరగాలి
- క్యూర్ పరిధిలో ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి
- కొత్త డంప్ యార్డులు అందుబాటులోకి తీసుకురండి
- మున్సిపల్ కమిషనర్ల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం :

హైదరాబాద్ నగరాన్ని క్లీన్‌సిటీగా మార్చాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం క్యూర్ పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పొరేషన్స్‌కు సంబంధించిన ఉన్నతాధికారుతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రతీరోజు చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో ప్రతీరోజు ఇంటింటికి చెత్త సేకరణ జరగాల్సిందేనని - మిగతా 2లో..



స్వచ్ఛదనం - పచ్చదనమే
ఎజెండా

- పల్లెల్లో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలు
- 99 రోజుల్లోనే పలు కార్యక్రమాలు

హైదరాబాద్- సూర్య వాస్తవం :

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని రాష్ట్రమంతటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్ని శాఖలకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించనుంది. ఆరు అంశాల్లో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. మొట్టమొదటగా పల్లెపల్లెనా పారిశుధ్యంపై దృష్టి పెట్టనుంది. తాగునీరు,



చెత్త నిర్వహణ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, రాబోయే వర్షాకాల ముందస్తు పనులపై దృష్టి పెట్టే ప్రణాళికను తయారు చేసింది. ఏ రోజుకారోజు విభిన్న కార్యక్రమాలతో జనంలోకి వెళ్లేందుకు వీలుగా షెడ్యూలు రూపొందించింది. సుపరిపాలనతో గ్రామీణ వ్యవస్థను - మిగతా 2లో..



మహిళలు అన్ని
రంగాల్లోనూ ఎదగాలి

- వైసీపీ అధ్యక్షులు జగన్

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

కొత్తగా ఆలోచించే వారి కోసం
'క్రియేటివ్ సిటీ'

- సీఎం చంద్రబాబు ప్రకటన
- ఢిల్లీలో రైసినా డైలాగ్-2026 సదస్సు
- ఈ సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఘనత
- త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి
- దక్షిణాదిలో తగ్గుతున్న జననాల రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

"విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనా త్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దు తున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకు న్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరు తాయని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా - మిగతా 2లో..



జగన్ మద్య నిషేధం హామీ వెనుక
కథ వేరే ఉంది

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

అమరావతి - సూర్య వాస్తవం :

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. - మిగతా 2లో..

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

ఆదివారం
08 మార్చి 2026

అమెరికా రాడార్ వ్యవస్థను
ధ్వంసం చేసిన ఇరాన్

(మొదటిపేజీ తరువాయి)

పరికరాలను జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ వైమానిక స్థావరం వద్ద ఇరాన్ ధ్వంసం చేసిందని సీఎన్ఎన్ వార్తా సంస్థ గతంలోనే తెలియజేసింది. ఆ తర్వాత దానిని అమెరికా అధికారి ధ్రువీకరించారు. జోర్డాన్‌లో గత నెల 28న, ఈ నెల 3న ఇరాన్ దాడి చేసింది. ఇప్పటి వరకూ ఇరాన్ జరిపిన దాడులలో థాడ్ రాడార్‌పై జరిపినదే అత్యంత విజయవంతమైనదని ఓ నిపుణుడు వ్యాఖ్యానిం చారు. అయితే అమెరికా సైన్యానికి, దాని మిత్రులకు మరికొన్ని రాడార్లు కూడా అందుబాటులో ఉన్నాయని, అవి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేస్తాయని ఆయన తెలిపారు. థాడ్ రాడార్ ధ్వంసం కావడంతో క్షిపణులను అడ్డుకునే బాధ్యత ఇప్పుడు పాట్రియట్ వ్యవస్థలపై పడింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు ఎనిమిది థాడ్ వ్యవస్థలు ఉన్నాయి. ఒక్కో వ్యవస్థ ఖరీదు బిలియన్ డాలర్ల వరకూ ఉంటుంది. ఇందులో రాడార్ ఖరీదు 300 మిలియన్ డాలర్లు.

పొరుగు దేశాలకు లొంగిపోయిన ఇరాన్ : ట్రంప్

మధ్యప్రాచ్యంలో ఇరాన్ పరాజితగా మిగిలిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయిందని వ్యాఖ్యానించారు. అమెరికా, ఇజ్రాయిల్ దళాలు నిరంతరాయంగా చేస్తున్న దాడుల కారణంగానే ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పారని, ఇకపై దాడులు చేయబోమని అన్నారని తెలిపారు. ఇరాన్ గతంలో ఎన్నడూ ఇంతలా పరాజయం పొందలేదని అన్నారు.

అంతర్జాతీయ చట్టం ప్రకారం నడుచుకుంటాం : శ్రీలంక

ఇరాన్ నౌక నుంచి రక్షించిన సిబ్బంది విషయంలో అంతర్జాతీయ చట్టం ప్రకారమే నడుచుకుంటామని శ్రీలంక తెలిపింది. సిబ్బందిని ఇరాన్‌కు అప్పగించవద్దంటూ అమెరికా ఒత్తిడి తెస్తోందని వస్తున్న వార్తల నేపథ్యంలో శ్రీలంకకు చెందిన ఓ మంత్రి ఈ వ్యాఖ్య చేశారు. కాగా ఇజ్రాయిల్, అమెరికా దళాల దాడిలో ఇరాన్ ప్రజలు పెద్ద సంఖ్య లో ప్రాణాలు కోల్పోవడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. సుప్రీం నేత ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు, రాజకీయ నేతలు, సైనికాధికారులు చనిపోవడంపై పుతిన్ సంతాపం వ్యక్తం చేస్తూ యుద్ధానికి వెంటనే స్వస్తి చెప్పి సమస్యకు దౌత్యపరమైన పరిష్కారం సాధించాలని అన్ని పక్షాలకు విజ్ఞప్తి చేశారు.

బెంగాల్ పర్యటనలో
ప్రొటోకాల్ లోపాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర బెంగాల్‌లోని సిలిగురిలో శనివారం నాడు అంతర్జాతీయ సంతాల్ ఆదివాసీ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సివుంది. అయితే అక్కడ ఈ సదస్సు నిర్వహించేందుకు అధికారులు చివరి నిమిషంలో అనుమతి రద్దు చేశారు. ప్రజలు భారీగా గుమిగూడే అవకాశం ఉందన్న భద్రతా కారణాలను చూపుతూ వేదికను డార్జిలింగ్‌కు మార్చారు. ఈ అంశంపై స్థానికుల ఎదుటే ముర్ము అసహనం వ్యక్తంచేశారు. ప్రోటోకాల్‌తో పాటు సన్నాహాల్లో తలెత్తిన లోపాలను ముర్ము ఎత్తి చూపారు. తాను రాష్ట్రానికి వెళ్లినప్పుడు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కానీ, కనీసం ఆ రాష్ట్ర మంత్రులు కానీ రాలేదన్నారు. కేవలం మేయర్ మాత్రమే వచ్చారని అన్నారు. సిలిగురిలో 5 లక్షల మంది ప్రజలు తరలివచ్చినా సరిపోయేంత స్థలం ఉందని చెప్పారు. సదస్సు చప్పగా జరగాలని, ఆదివాసీలు ఎవరూ అక్కడకు రావద్దానే ఉద్దేశంతోనే అలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మమతతో తనకు ఎలాంటి ద్వేషం లేదని, ఆమె తన చెలెల్లు లాంటిదని రాష్ట్రపతి ముర్ము వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా స్పందించారు. "రాష్ట్రపతి వ్యక్తం చేసిన బాధ, వేదన భారతదేశ ప్రజల మనస్సుల్లో అపారమైన విచారాన్ని కలిగించింది. తృణమూల్ ప్రభుత్వం నిజంగా అన్ని పరిమితులను దాటింది. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి వారి పరిపాలన బాధ్యత వహిస్తుంది" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

అధిష్ఠానం అనుమతిస్తే ఇంకో
రెండు బడ్జెట్లు ప్రవేశపెడతా!

- రాష్ట్రంలో ఇప్పటివరకు అత్యధికంగా
17 బడ్జెట్లు ప్రవేశపెట్టిన సిద్ధరామయ్య
- అధిష్ఠానం నిర్ణయం మేరకే పదవిలో కొనసాగుతానని స్పష్టీకరణ
- ప్రధాని మోదీ వచ్చాకే ఎల్పీజీ ధరలు పెరిగాయని మండిపాటు

బెంగళూరు - సూర్య వాస్తవం :

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ పదవీకాలం మరో రెండేళ్లు మిగిలి ఉన్న నేపథ్యంలో.. పార్టీ హైకమాండ్ అనుమతిస్తే మరో రెండు బడ్జెట్‌లను తానే ప్రవేశపెడతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. పరోక్షంగా, పూర్తి టర్మ్ తానే సీఎంగా కొనసాగుతాననే కోణంలో వ్యాఖ్యానించారు. సీఎం పీఠం కోసం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సిద్ధంగా ఉన్న నేపథ్యంలో సిద్ధరామయ్య వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. శనివారం వరుణ హోబ్లీలోని పిల్లహళ్లి హెలిప్యాడ్ వద్ద జిల్లా యంత్రాంగం నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రిగా కొనసాగడం, బడ్జెట్ ప్రవేశపెట్టడంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. రాష్ట్ర ప్రజలు తాను కొనసాగాలని కోరుకుంటున్నారని, అయితే అంతిమ నిర్ణయం మాత్రం హైకమాండ్‌దేనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. "నాకు పూర్తి నమ్మకం ఉంది. అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటాను. బడ్జెట్‌ల విషయంలో రికార్డులు బద్దలు కొట్టడం ముఖ్యం కాదు, కానీ అవకాశం ఇస్తే చేయడం సాధ్యమే" అని ఆయన అన్నారు. తాను ఇప్పటివరకు 17 బడ్జెట్‌లను ప్రవేశపెట్టానని, రాష్ట్రంలో ఇదే అత్యధికమని గుర్తు చేశారు. మీడియా ప్రతినిధులు ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగినా తన సమాధానం మారదని, హైకమాండ్ ఉండమంటే ఉంటానని, వద్దంటే తప్పుకుంటానని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్ ధరల పెరుగుదలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర ఎంత ఉందో అందరికీ తెలుసని, బీజేపీ వచ్చాకే ధరలు పెరిగాయని ఆరోపించారు. మీడియా ఈ విషయాలను రాయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం దండిమారమ్మ, సిద్దప్పాజీ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కుంభాభిషేక మహోత్సవంలో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనమే
ఎజెండా

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతం చేసేందుకు వీలుగా ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది.

షెడ్యూల్ ఇదే

1. గ్రామీణ పరిశుభ్రత కార్యక్రమాలు -- మార్చి 6 నుంచి మార్చి 15
2. గ్రామాల ఆదాయం పెంపు చర్యలు -- మార్చి 16 నుంచి 31 వరకు
3. తాగునీటి సరఫరా -ఏప్రిల్ 1 నుంచి 15 వరకు
4. చెత్త తొలగింపు, చెత్త నిర్వహణ -- ఏప్రిల్ 16 నుంచి 30 వరకు
5. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం -- మే 1 నుంచి 15 వరకు
6. వానాకాలానికి ముందస్తు పనులు..ఏర్పాట్లు -- మే 16 నుంచి 31 వరకు

గ్రామీణ పరిశుభ్రత కార్యక్రమం

రహదారుల శుభ్రత, కాలువల మురుగు తొలగింపు, పాఠశాలలు, అంగన్వాడీలు, మార్కెట్లు, హాస్టళ్లు, బస్టాండ్లను శుభ్రపరచడం, రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో పొదలను తొలగించడం, ఉపయోగంలో లేని బావులను మూసివేయడం, బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లడం, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ శుభ్రపరచడం, అవసరమైన సిబ్బంది, సామగ్రి కోసం ప్రణాళిక తయారు చేయడం, ఖర్చులు గ్రామపంచాయతీ సాధారణ నిధులు, రాష్ట్ర, కేంద్ర ఆర్థిక నిధులను వినియోగించడం.

గ్రామాల ఆదాయం పెంపు

సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సరఫరాలో చేపట్టే పనులు చేయడం. తాగునీటి సరఫరా ఇబ్బందులు తెలుసుకోవడం, పూర్తిగా పనిచేసేలా చేయడం, ముందస్తు చర్యలు, గ్రామపంచాయతీ నిధులు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను వినియోగించడం, మార్చి 27 లోపు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయడం, చేయాల్సిన పనులు, హ్యాండ్ పంపుల మరమ్మతులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్ పంపుల మరమ్మతులు, ఓవర్ హెడ్ ట్యాంకుల మరమ్మతులు, కొత్త ఇండ్లకు తాగునీటి కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులను గ్రామ పంచాయతీ స్థాయిలో మున్సిపల్ శాఖతో సమన్వయం చేయాలి.

చెత్త సేకరణ.. చెత్త నిర్వహణ

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడం, ప్రతి గ్రామపంచాయతీలో కంపోస్ట్ తయారు చేయడం, చెత్త నిర్వహణపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, ఈ-వేస్ట్, బయోమెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్‌ను సురక్షితంగా సేకరించి తొలగించడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు పూర్తి చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు ఏర్పాటు చేయడం, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మించడం

ఉపాధి హామీలో చేపట్టేవి

నీటి సంరక్షణ పనులు, వ్యక్తిగత లబ్ధిదారుల పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధం చేయడం. వర్షపు నీటి కాలువల మురుగు తొలగించడం, లోతట్టు ప్రాంతాల్లో మట్టి నింపడం, దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం, ఫాగింగ్ డ్రై డే కార్యక్రమాలు నిర్వహించడం, మొక్కలు నాటడం, నరేగా పథకం ద్వారా గుంతలు తవ్వడం, మొక్కలు నాటేందుకు ప్రదేశాలు గుర్తించడం, నాటే మొక్కలను ఎంపిక చేయడం, రోడ్లు, భవనాల సంరక్షణ, గ్రామీణ రోడ్ల మరమ్మతులు, డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో ఉన్న రోడ్ల సంరక్షణ, బీటీ రోడ్లను శుభ్ర పరచడం, కిలోమీటర్ రాళ్లు, సమాచారం బోర్డులు, సైన్ బోర్డులు పునరుద్ధరించడం, భవనాల సంరక్షణ, పైకప్పుల పగుళ్లను సరిచేయడం, ఆయా భవనాల టెర్రస్ శుభ్రపరచడం, భవనాలకు పెయింటింగ్ చేయడం.

హైదరాబాద్‌ను
క్లీన్ సిటీగా మార్చాలి

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. చెత్త సేకరణకు సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించేలా ఇప్పటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కో వాహనానికి ఒక్కో ఏరియా చొప్పున కేటాయించి నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. నగరం పరిధి విస్తరించిన నేపథ్యంలో ఇప్పటికే కొత్తగా గుర్తించిన డంప్ యార్డులను వీలైనంత త్వరగా సిద్ధం చేసి అందుబాటు లోకి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ల వారీగా దగ్గరలోని డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాల్సిన అవసరముందని చెప్పారు. నిర్మాణ వ్యర్థాలకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. క్యూర్ పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పొరేషన్లలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అపరిశుభ్రత లేకుండా చూసుకోవడంతోపాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల విషయంలో నగరవాసులకు సరైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రెటరీ మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినరుకృష్ణారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యూఎస్ గవర్నర్

అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ శనివారం సీఎం ఏ రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఆయనతో మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య, విద్యారంగాల్లో సంస్కరణలపై సీఎం ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేసిన పేద మధ్యతరగతి ప్రజలకు ఇండ్లు, రుణమాఫీ ఇతర అంశాలను సీఎం ఆయనకు వివరించారు.డేటా ప్రివెన్షన్, యూనివర్సల్ హెల్త్ కేర్ రంగాలపైనా వారు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రతినిధుల బృందంతో డెలావర్‌కు రావల్సిందిగా మాట్ మేయర్ సీఎంను ఆహ్వానించారు.

కొత్తగా ఆలోచించే వారి కోసం
'క్రియేటివ్ సిటీ'

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

అవకాశాల గనిగా భారత్

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

జనాభా నిర్వహణపై దేంజర్ బెల్స్

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు.

పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ. 25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ. 1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి వచ్చిన 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, వ్యూహకర్తలు హాజరైన ఈ సదస్సులో చంద్రబాబు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతోనూ, పొరుగు రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుంటూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం వివరించారు.

జగన్ మద్య నిషేధం హామీ వెనుక
కథ వేరే ఉంది

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు. మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

మహిళలు అన్ని
రంగాల్లోనూ ఎదగాలి

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి - సూర్య వాస్తవం : మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే వారు పురోగతి సాధించినట్లవుతుందని వైసిసి అధినేత జగన్ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సంతోషంగా ఉన్నప్పుడే కుటుంబం బావుంటుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో మహిళా సాధికారత కోసం పనిచేశామని, వారిని ప్రోత్సహించామని, 32కుపైగా పథకాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామని తెలిపారు.

సంపాదకీయం

యుద్ధంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యమే



యుద్ధం ప్రకటించేది ముసలివారు, కానీ పోరాడి చనిపోయేది మాత్రం యువకులే " .. రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా అధ్యక్షుడుగా వ్యవహరించిన హెర్బర్ట్ హూవర్ చెప్పిన మాట. ఎందుకంటే యుద్ధం వినాశనాన్ని ఆయన కళ్లారా చూశారు మరి. ఇప్పుడు అదే అమెరికాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ట్రంప్ దీన్ని నిజం చేస్తున్నారు. యుద్ధాలు చూసిన వారు .. యుద్ధాల్లో పాల్గొన్న వారు ఎవరైనా సరే చెప్పే మాట యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరనే. అయినా ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకునేంత విశాలమైన దృక్పథం లేని ట్రంప్ లాంటి నేతలే ప్రపంచాన్ని ఏలుతున్నారు. చరిత్ర పుటలను తిరగేస్తే కనిపించేది కేవలం రాజ్యాల విస్తరణో, వీరుల పరాక్రమమో కాదు.. ప్రతి యుద్ధం చివరన మిగిలిన శ్మశాన వైరాగ్యం. యుద్ధంలో విజేతలు ఉండరు.. కేవలం ప్రాణాలతో మిగిలిన వారు మాత్రమే ఉంటారు అన్నది జగమెరిగిన సత్యం. కానీ, దురదృష్టవశాత్తూ చరిత్ర నేర్పిన పాఠాలను విస్మరించడమే మానవజాతి అలవాటుగా మార్చుకుంది.ఖొమైనీని చంపేసినా విజయం దక్కలేదు చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ ఒక ముగింపును ఇవ్వలేదు, అవి కేవలం కొత్త అధ్యాయాలకు రక్తపాతంతో కూడిన ప్రారంభాలను మాత్రమే రాశాయి. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన నాయకత్వ నిర్మూలన ఆధునిక యుద్ధ తంత్రంలో ఒక సంచలనం కావచ్చు. కానీ, ఒక వ్యక్తిని లేదా ఒక వ్యవస్థ శిఖరాగ్రాన్ని తొలగించినంత మాత్రాన ఆ దేశంపై లేదా ఆ సిద్ధాంతంపై విజయం సాధించామనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని అనంతర పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇరాన్ వంటి దేశాల్లో అధికారం అనేది కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదు. దశాబ్దాలుగా అక్కడ నిర్మితమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఒక బలమైన మతపరమైన అధికార యంత్రాంగం, నాయకత్వం కోల్పోయినప్పుడు మరింత ఉధృతంగా స్పందిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు తమ ఎడారి వంటి వాతావరణంలో ఎంతో కష్టపడి నిర్మించుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఏర్పడింది. శత్రువును నామరూపాలు లేకుండా చేయాలనే ఆకాంక్ష సిద్ధాంతపరంగా బాగుండవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో అది అసాధ్యం. విత్తనాన్ని మట్టిలో పాతిపెడితే అది చనిపోదు, మరింత బలమైన వృక్షంగా మొలుస్తుంది. యుద్ధాల విషయంలో కూడా పగ, ప్రతీకారాలు అలాగే రూపాంతరం చెందుతాయి. ఖొమైనీ మరణం తర్వాత ఇరాన్ బలహీనపడిందని జరుగుతున్న పరిణామాలను చూసి ఎవరూ అనుకోవడంలేదు. ఒక కేంద్రీకృత నాయకత్వం లేనప్పుడు, ఆ వ్యవస్థలోని చిన్న చిన్న విభాగాలు స్వయంప్రతిపత్తితో విధ్వంసానికి తెగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా, హోర్ముజ్ జలసంధి మూసివేత, అంతర్జాతీయ ఇంధన సరఫరాపై దాడులు, లెబనాన్ నుండి హిజ్బుల్లా ప్రయోగిస్తున్న క్షిపణులు.. ఇవన్నీ ఒక దేశాన్ని దెబ్బకొడితే ప్రపంచం మొత్తం ఎలా వణికిపోతుందో నిదర్శనాలు. విజేతగా నిలిచామని సంబరపడే లోపే, ఆర్థిక మాంద్యం , ప్రాంతీయ అస్థిరత అనే రూపాల్లో ఓటమి తలుపు తడుతోందని ఎప్పటికప్పుడు అనుభవమైన నిజం.యుద్ధంలో గెలిచిన వాడు కూడా ఓడిపోయిన వాడితో సమానమే, ఎందుకంటే ఇద్దరూ తమ ఆత్మీయులను కోల్పోతారు." అని శ్రీశ్రీమద్భాగవతంలో మనం చెప్పుకున్నాం. యుద్ధం గురించి చరిత్ర కేవలం గెలిచిన పక్షం పేరును మాత్రమే చెబుతుంది. కానీ ఆ గెలుపు కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పుడూ విస్మరిస్తుంది. సరిహద్దుల మీద ఎగిరే జెండా ఆ దేశపు ఆత్మగౌరవానికి చిహ్నంగా కనిపించవచ్చు, కానీ ఆ జెండాను మోయాల్సిన యువతరం శ్మశానాల్లో కలిసిపోవడం ఏ విజయానికి సంకేతమనేది ఎవరు చెప్పగలరు? ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరాటంలో అగ్రరాజ్యాలుగా వెలుగొందాలని చూసే దేశాలు, తమ భావి తరాల ఉనికినే పణంగా పెడుతున్నాయి. యుద్ధరంగంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యం మాత్రమే. ఆర్థికంగా బలపడటం కోసం లేదా భూభాగాల కోసం చేసే యుద్ధాలు, ఒక దేశపు వెన్నెముకను విరిచేస్తాయి. యుద్ధం వల్ల కలిగే విధ్వంసం కేవలం భవనాలకూ, ఆస్తులకూ పరిమితం కాదు. అది ఒక దేశపు ఆర్థిక మూలాలను, సామాజిక సమతుల్యతను దశాబ్దాల పాటు కుంగదీస్తుంది. యుద్ధం కోసం వెచ్చించే వేల కోట్ల నిధులు మానవాభివృద్ధికి ఉపయోగపడాల్సినవి, కానీ అవి వినాశనానికి ఖర్చవుతున్నాయి. ఈ ప్రక్రియలో కోల్పోయిన మానవ వనరులు, మేధస్సు మళ్ళీ పునరుద్ధరించలేనివి. విజేతగా నిలిచిన దేశం కూడా పతనమైన ఆర్థిక వ్యవస్థతో, గాయపడిన సమాజంతోనే మనుగడ సాగించాల్సి వస్తుంది.

ఇప్పుడు అమెరికా,ఇజ్రాయెల్‌లకు రేపు యుద్ధం చేయాలనుకునే మరో దేశానికీ అదే పరిస్థితి వస్తుంది. ఆధునిక కాలంలో యుద్ధం అనేది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, అది ఒక తరం మేధస్సును, సృజనాత్మకతను అణచివేసే చీకటి అధ్యాయం. యుద్ధం వల్ల కలిగే మానసిక గాయాలు, అస్థిరత సమాజంలో విద్వేష బీజాలను నాటుతాయి. మూడవ ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు కానీ, నాలుగవ ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లు, రప్పలతో జరుగుతుంది.. ఐన్‌స్టీన్ చెప్పిన మాటను ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్న నేతలు గుర్తు తెచ్చుకోవాలి. చరిత్ర పుటల్లో తమ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలనే కొందరు పాలకుల వ్యక్తిగత అహంకారం, నేడు లక్షలాది మంది సామాన్యుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తోంది. యుద్ధాన్ని ఒక దౌత్యపరమైన సాధనంగా కాకుండా, తమ ఉనికిని చాటుకునే ప్రచార అస్త్రంగా మార్చుకోవడం అత్యంత ప్రమాదకరం. డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలు కూడా యుద్ధాల వల్ల కలిగే అపారమైన ఆర్థిక నష్టాన్ని, వనరుల దుర్వినియోగాన్ని ప్రస్తావిస్తున్నారంటే, యుద్ధం అనేది కేవలం ప్రాణ నష్టమే కాదు, ఒక దేశపు ఆర్థిక మూలాలను దెబ్బతీసే అత్యంత ఖరీదైన వ్యర్థం అని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో రాబోయే ఊహాజనిత ముప్పులను అడ్డుకోవా లనే భ్రమలో, వర్తమానంలో ఉన్న శాంతిని, స్థిరత్వాన్ని పణంగా పెట్టడం పాలకుల విజ్ఞతకు నిదర్శనం కాదు, అది వారి రాజకీయ బాధ్యతారాహిత్యమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల ప్రథమ కర్తవ్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, కానీ క్షిపణుల ప్రయోగాలే పరాక్రమంగా భావిస్తున్నారు. వివేకవంతులైన పాలకులు యుద్ధాన్ని నివారించడంలోనే తమ గొప్పతనాన్ని వెతుక్కోవాలి తప్ప, యుద్ధాన్ని సృష్టించడంలో కాదు.యుద్ధాన్ని అంతం చేయకపోతే యుద్ధమే మనల్ని అంతం చేస్తుంది !ఆధునిక ప్రపంచంలో పాలకులకు కావాల్సింది యుద్ధ క్షేత్రంలో ప్రదర్శించే పరాక్రమం కాదు, చర్చల విషయంలో ప్రదర్శించే దౌత్యనీతి. చరిత్రను అధ్యయనం చేయడం అంటే కేవలం గతంలో జరిగిన యుద్ధాల విజయగాథలను నెమరువేసుకోవడం కాదు..

ఆ ఘర్షణలు మిగిల్చిన రక్తపాతాన్ని, విధ్వంసాన్ని గుర్తించి, అటువంటి తప్పులు మళ్ళీ జరగకుండా చూడటం. శాంతిని కోరుకోవడం అంటే చేతకానితనం కాదు, అది ఒక పరిణతి చెందిన నాగరికతకు, అత్యంత శక్తివంతమైన నాయకత్వానికి నిదర్శనం. క్షిపణుల గర్జనల కంటే చర్చల ద్వారా లభించే పరిష్కారాలే సుస్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేస్తాయి. ఈ సత్యాన్ని పాలకులు విస్మరిస్తే, వారు చరిత్రలో నిర్మాతలుగా కాకుండా విధ్వంస కారులుగా మిగిలిపోతారు. రేపటి తరం మన నుండి ఆశించేది కేవలం సాంకేతిక విప్లవం ,ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు, సురక్షితమైన , ప్రశాంతమైన జీవన వాతావరణాన్ని కూడా. పాలకుల స్వార్థపూరిత నిర్ణయాలు, బాధ్యతారాహిత్యం వల్ల భూగోళం శిథిలమైతే, ఆ వినాశనానికి ఏ సిద్ధాంతం కూడా ప్రాయశ్చిత్తం చేయలేదు. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు ఆయుధ పోటీని వీడి, మానవీయ విలువలపై దృష్టి సారించాలి. శాంతియుత సహజీవనం మాత్రమే ఈ గ్లోబల్ విలేజ్ ను కాపాడగల ఏకైక మార్గం. యుద్ధం గెలిస్తే దేశం గెలవొచ్చు, కానీ శాంతి గెలిస్తేనే మానవత్వం గెలుస్తుంది.

14 దేశాలకు పాకిన యుద్ధం

న్యూయార్క్ - సూర్య వాస్తవం



మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పెట్టిన చిచ్చు క్రమంగా రగులుతోంది. మొదట ఇరాన్‌పై అమెరికా? ఇజ్రాయెల్ దాడులతో యుద్ధం మొదలైంది. తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా మట్టు బెట్టడంతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. అయితే ఈ దాడులు ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా బేస్‌లు ఉన్న గల్ఫ్ దేశాలపై వైమానికి దాడులు చేసింది. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, ఓమన్, టర్కీ తదితర దేశాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభించి ఏడు రోజులైంది. మూడు దేశాలతో మొదలైన యుద్ధం ఇప్పుడు 14 దేశాలకు విస్తరించింది. ఇప్పుడు ఇరాక్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, జోర్డాన్, అజర్‌బైజాన్, ఒమాన్, సౌదీ అరేబియా, లెబనాన్, సైప్రస్ వంటి 14 దేశాలను యుద్ధం చుట్టుముట్టింది. చర్చలు లేకపోవడంతో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. రష్యా? ఉక్రెయిన్ యుద్ధంలాగా ఈ ఘర్షణ కూడా సంవత్సరాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం విస్తరించేందుకు అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తుంది. మరోవైపు అమెరికా? ఇజ్రాయెల్ ఇరాన్‌ను వీలైనంత త్వరగా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌కు ప్రాక్సీ దళాలు (హిజ్బుల్లా, హౌతీలు) దీర్ఘకాల పోరాటానికి అనుకూలం. అమెరికా, ఇజ్రాయెల్ ఆధునిక ఆయుధాలతో పైచేయి సాధిస్తున్నా, ప్రాంతీయ మద్దతు బలహీనత కలిగిస్తోంది. చైనా కూడా ఇరాన్ సార్వభౌమాధికారం కాపాడతామని ప్రకటించింది. దీంతో చైనా కూడా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న రష్యా, వాణిజ్య భాగస్వామి చైనా రంగంలోకి దిగితే పరిస్థితి ప్రపంచ యుద్ధ స్థాయికి చేరుకుంటుంది. రష్యా డ్రోన్‌లు, మిస్సైల్ సాంకేతికత ఇచ్చి ఉక్రెయిన్ మోడల్‌ను పునరావృతం చేయవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిడి, ఓసియాన్ మార్గాల్లో జోక్యం చేస్తే అమెరికా శక్తి విభజన అవుతుంది. ఇది నాటో, అరబ్ మిత్రుల మధ్య వైరుధ్యాలను పెంచుతుంది. తక్షణ శాంతి ఒప్పందాలు లేకపోతే యుద్ధం రెండేళ్లు కొనసాగవచ్చు. ఐరోపా, ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వం జరిగితే మాత్రమే మొదటి దశలో ఆగిపోతుంది. ఆర్థిక సంక్షోభాలు, ఆంతరిక అశాంతి ద్వారా కూడా యుద్ధం ఆగే అవకాశం ఉంది. అయితే, ప్రాంతీయ అస్థిరత భవిష్యత్ దశాబ్దాల్లో కొనసాగుతుంది.

ఏపీ లిక్కర్ స్కామ్

3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు

విజయవాడ - సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది.మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది.సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది.కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలు?పంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ఎంఆఅఒ కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది.కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది.ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి.ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

దళితులకు శ్మశానాలు చూపాలని ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు

గుత్తి - సూర్య వాస్తవం : గుత్తి మండల కేంద్రంలోకి శ్మా శాన సాధన జీపు యాత్ర చేరు కొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాల వేసిన అనంతరం సాకే హరి మాట్లా డారు.సామాజిక సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందామని చె ప్పుకునే పాలకులు దళిత,గిరి జనులు చనిపోతే పూడ్చడా నికి ఆరడుగుల స్థలం చూపు లేకపోవడం విడ్డూరమ న్నారు. చనిపోయిన ప్రతిసారి శవాల ను ఇళ్ళ ముందు ఉంచుకొని ఎక్కడ అంతక్రియలు చేయా లో దిక్కుతోచని స్థితిలో బా ధపడిన సందర్భాలు అనేకమ న్నారు.శ్మశానాలు చూపాలని అధికారులు నాయకులు చుట్టూ ఏళ్ల తరబడి తిరిగిన ప్ర యోజ నం లేకపోయిందని చివరకు శవాలతోనే రహదా రులు కార్యాలయాల్లో ముందు ధర్నాలు చేపట్టామ న్నారు. కుల వివక్షత, అంటరానితనం, బానిసత్వము నేటికీ కొనసా గింపులో భాగంగానే తీవ్ర అ న్యాయం జరుగుతోందని వా పోయారు.ప్రతి గ్రామంలోనూ శ్మాశాన వాటికలకు హద్దులు ఏర్పాటు చేసి అన్ లైన్



నమో దు చేసి ప్రహరి నిర్మించి కనీస వసతులు కల్పించి శ్మాశానా లు కబ్జా చేసిన వారిపై కఠిన చర్య లు తీసుకోవాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శ్మా శాన వాటికల సమస్యలపై ప్ర భుత్వం చిత్తశు ద్ధితో పరిష్క రించకపోతే పెద్ద ఎత్తున ఆం దోళన కార్యక్రమాలు చేపడ తామని హెచ్చరించారు.జీపు యాత్రకు మద్దతుగా సీనియర్ దళిత నాయకులు రామ్ దా సు,ఏపీ ఎమ్మార్పీఎస్ అంజన ప్రసాద్, మాల మహానాడు బం డల రామాంజనేయులు,జన సేన మార్కెట్ డైరెక్టర్ మిద్దె ఓ బులేసు,కెవిపిఎస్ మల్లికార్జు న,మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి పామిడి చలప తి ఎమ్మార్పీఎస్ రాము, ఓబు లేష్, నెట్టికంటప్ప, నాగన్న, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ లైన్‌మెన్ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా ఈఈ ప్రసాద్ రెడ్డి



పులివెందుల - సూర్య వాస్తవం : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఏపీ ఎస్పీడీసీఎల్ జాతీయ లైన్‌మెన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక కరెంట్ ఆఫీస్ ఆవరణలో ఉన్న విద్యుత్తు ప్రజా కళా వేదిక వద్ద శనివారం జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈఈ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని తమ చేతుల మీదుగా నిర్వహించడం చాలా సంతోషకరమని ముఖ్యంగా ఫీల్డ్‌లో లైన్మెన్లు నిరంతరం అహర్నిశలు కష్టపడుతూ 24 గంటలు స్వచ్ఛమైన కరెంటును ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇవ్వడం జరుగుతుందని చాలా సంతోషకరమని ఆలాగే ప్రతి ఒక్క లైన్మెన్ కూడా విధులు నిర్వహించేటప్పుడు కచ్చితంగా సేఫ్టీ పరికరాలు ఉపయోగించుకొని తగు జాగ్రత్తలు తీసుకొని అలాగే ఎల్ సి తీసుకున్నప్పుడు ఒకటికి రెండుసార్లు ఫీడర్ చెక్ చేసుకుని సప్లై ఉన్నదా లేదా అని సమాచారం తెలిసిన తర్వాతే పోల్ ఎక్కి పనిచేయాలని ఈనియమా న్ని కచ్చితంగా ప్రతి ఒక్కరు పాటించవలసినదిగా తెలిపారు. అనంతరం పులివెందుల డివిజన్ సంబంధించి 2026 సంవత్సరం బెస్ట్ లైన్మెన్లుగా ఆనంద్ రెడ్డి, బాబావల్లి, బాల నరసింహులు, వేణుగోపాల్‌లకు ప్రసాద్ రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ గురు మోహన్ రెడ్డి, ఏడి సుధాకర్ రెడ్డి, ఏఈలు రమేష్ రెడ్డి, రమేష్, వేణుగోపాల్, సబ్ ఇంజనీర్లు, లైనింగ్, ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, ఏఎల్ఎం, జేఎల్ఎంల, ఈఆర్ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వికసిత్ భారత్ యువత పార్లమెంట్ పోటీల్లో త్రిబుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ



వేంపల్లె - సూర్య వాస్తవం : కడప జిల్లా కేంద్రంలో జాతీయ యువజన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ యువత పార్లమెంట్ 2026 పోటీలలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (త్రిబుల్ ఐటీ) విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో త్రిబుల్ ఐటీకి చెందిన విద్యార్థులు దస్తగిరి బాష ప్రథమ స్థానం 3 వేల నగదు బహుమతి మరియు కంభగిరి స్వామి ద్వితీయ స్థానాలు 2 వేల నగదు బహుమతి సాధించి విశేష గుర్తింపు పొందారు. అంతేకాకుండా, అదే సంస్థకు చెందిన లక్ష్మి సిందూర, వెన్నెల, జయంత్, నజీర్ అహ్మద్, పంచెటి సంధ్య కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఈ పోటీలకు విద్యార్థులు త్రిబుల్ ఐటీ ఉన్నత విద్య పోటీ పరీక్షల విభాగపు అధికారి డా. డి.కోనప్ప పర్యవేక్షణలో హాజర య్యారు. విద్యార్థులు అత్యవసర పరిస్థితి 50 సంవత్సరాలు, భారత ప్రజాస్వామ్యానికి నేర్పిన పాఠాలు అనే అంశాలపై తమ ఆలోచనలు, అభిప్రాయాలను పార్లమెంట్ తరహాలో ప్రదర్శిస్తూ విశేష ప్రతిభ కనబరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను త్రిబుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో కూడా పాల్గొని విశిష్ట విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ అభి నందన కార్యక్రమంలో త్రిబుల్ ఐటీ డీన్ అఫ్ అకాడమిక్ రమేష్ కైలాస్ మరియు అసోసియేట్ డీన్ నవీన్ కుమార్ పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల ఈ విజయంతో త్రిబుల్ ఐటీకి మరింత ప్రతిష్ఠ పెరిగిందని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.

ఘనంగా నో బ్యాగ్ డే



వేంపల్లె - సూర్య వాస్తవం : తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేంపల్లిలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు న్యూటన్, ఏపీజే అబ్దుల్ కలామ్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి సైంటిస్టులు, ఇంజనీర్ల వేషధారణతో అందరినీ అలరించారు. న్యూటన్ సిద్ధాంతాలతో సమాజ స్థితిగతినే మార్చివేసిన తన సిద్ధాంతాల గురించి వివరించారు. అలాగే మరో సైంటిస్ట్ అయినా ఏపీజే అబ్దుల్ కలాం గొప్పతనాన్ని గురించి శాస్త్ర సాంకేతిక రంగంలో ఆయన చూపిన ప్రగతి గురించి రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలు గురించి విద్యార్థులు తెలియజేశారు. ప్రపంచమే మెచ్చిన గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్పతనం గురించి భారతదేశంలో ఆయన నిర్మించిన అనేక ప్రాజెక్టుల గురించి తెలియజేస్తూ 101వ సంవత్సరం వయసులో కూడా ఆరోగ్యంగా ఉండగలడానికి తాను చెప్పిన ఆరోగ్య రహస్యాన్ని వివ రిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత, మిత భోజనం ఆయన ఆరోగ్య సూత్రం అని తెలియజేశారు ఆయన తయారు చేసిన మైసూర్ శాండిల్ సబ్బు నేటికీ ఎంతోమంది దేశవ్యాప్తంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. నో బ్యాక్ డే రోజు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఉపాధ్యాయులైన సైరాబాను, సునీత మేడం ను ప్రధానో పాధ్యాయులు ఇతర

కాగ్ అక్షింతలతోనైనా చంద్రబాబు ప్రభుత్వం కళ్లు తెరవాలి

- భారతదేశ సార్వభౌమత్వాన్ని ట్రంప్‌కు తాకట్టు పెట్టిన మోడీ

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లె - సూర్య వాస్తవం : కాగ్ అక్షింతలతోనైనా చంద్రబాబు ప్రభుత్వం కళ్ళు తెరవాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శనివారం వేంపల్లిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ ఇచ్చిన నివేదికను నిన్నటి రోజు శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగిందని, ఆ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించడం జరిగిందని తులసి రెడ్డి గుర్తు చేశారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండున్నర నెలలు వైకాపా ప్రభుత్వం తర్వాత తొమ్మిదిన్నర నెలలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని,రాష్ట్రానికి ఆర్థిక స్థిరత్వం లేదని, రాష్ట్ర భవిష్యత్ అంధకారమని,భవిష్యత్తు గడ్డు కాలమని నివేదికలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఇవి ప్రమాద హెచ్చరికలు. 2024 -25 బడ్జెట్లో 68 743 కోట్ల రూపాయలు అప్పు ఉంటుందని అంచనా వేసి చివరికి 81 వేల 71 కోట్ల రూపాయలు అప్పు చేయడం జరిగింది.అంటే అప్పులు అంచనా కంటే 16శాతం పెరిగాయి. ఇవి ప్రత్యక్ష అప్పులు మాత్రమే. పరోక్ష అప్పులు దీనికి అదనం. 2024 -25లో 32 717 కోట్ల రూపాయలు మూలధనం వ్యయం చేయాలని బడ్జెట్లో అంచనా వేసి చివరికి 16, 141 కోట్లు మాత్రమే మూలధన వ్యయం చేయడం జరిగింది.అంటే అంచనా కంటే 50 శాతం తగ్గింది.2023 -24 కంటే 2024 25 లో మూలధన వ్యయం 12 శాతం తగ్గింది. 2024 -25 లో కేంద్ర ప్రభుత్వం నుంచి 30 వేల 333 కోట్ల రూపాయలు గ్రాంట్ గా వస్తుందని అంచనా వేయగా చివరికి 20వేల 188 కోట్ల రూపాయలు మాత్రమే కేంద్రం నుంచి గ్రాంట్ రూపంలో వచ్చింది.అంటే పదివేల 145 కోట్ల రూపాయలు అంచనా కంటే తగ్గింది. డబుల్ ఇంజన్ పనితీరు ఇదేనా? అని తులసి రెడ్డి ప్రశ్నించారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో 365 రోజులకు గాను 357 రోజులు రాష్ట్రప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు వద్ద దేహీ అని చిప్ప పట్టుకుని చేబదుళ్ళ ద్వారా అప్పు తీసుకోవడం అత్యంత దురదృష్టకరం. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఒక్క లక్ష 72 వేల 532 కోట్ల రూపాయలు రాష్ట్రప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు దగ్గర చేబదుళ్ల రూపంలో అప్పు చేసిందని అందుకుగాను 303 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లించని చెల్లించిందని తులసి రెడ్డి వివరించారు. కాల్ అక్షింతలతోనైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంజ్ఞానోదయం తెచ్చుకొని ఆర్థిక క్రమశిక్షణ పాటించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టవద్దని తులసి రెడ్డి సూచించారు.

దేశ సౌర్వ భౌమత్వాన్ని ట్రంపుకు తాకట్టు పెట్టిన మోడీ.

భారతదేశ సార్వభౌమత్వం కోసమే మహాత్మా గాంధీ,తదితర స్వాతంత్ర సమరయోధులు బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి దేశానికి స్వాతంత్రం తెచ్చారు. మన రాజ్యాంగంలో భారతదేశం సర్వసత్తాక సార్వభౌమత్వ దేశమని పేర్కొనడం జరిగింది.

కానీ దురదృష్టవశాత్తు నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం భారతదేశ సార్వభౌమత్వాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు తాకట్టు పెట్టడం దురదృష్ట కరం. భారతదేశం ఎవరి దగ్గర పెట్రోలు,డీజీలు, గ్యాస్ తదితర వస్తువులు కొనాలి,ఎవరి వద్ద కొనొద్దు అని భారత దేశాన్ని అమెరికా అధ్యక్షుడు ఆదేశించడం, నిర్దేశించడం శోచనీయం. ఇది అత్యంత సిగ్గుచేటని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. చేతనైతే భారతదేశ సార్వ భౌమత్వాన్ని కాపాడాలి, లేకపోతే ప్రధానమంత్రి పదవి నుండి దిగిపోవాలి అని తులసి రెడ్డి మోడీకి సూచించారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా

సౌకర్యాలు సిద్ధం చేసుకోండి

- నరసింహస్వామి రథోత్సవ ఏర్పాట్లపై సుదీర్ఘ చర్చ

- రథోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్





శ్రీ సత్యసాయి బ్యూరో - సూర్య వాస్తవం :
కదిరి పట్టణం శ్రీ ఖాద్రి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 10న నిర్వహించనున్న రథోత్సవానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ శని వారం కదిరికి వచ్చి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాలు, రథం తిరిగే మార్గం, ప్రధాన కూడళ్లను జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ సందర్శించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశా రు. జిల్లా ఎస్పీ, డిఎస్పి శివ నారాయణ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు , ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి వెండి దండి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రథోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి ఆంధ్రతో పాటు, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టా లని ఆదేశించారు. రథోత్సవం జరిగే మార్గమంతా ఎక్కడ ఇటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. జన సందోహాన్ని నియంత్రించడంతో పాటు, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రథం తిరిగే ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తాగునీటితో పాటు, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా దేవాలయ ప్రాంతంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ సర్వెలెన్స్ ద్వారా భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు సురక్షితంగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తులు కూడా పోలీసులకు సహ కరించి నియమ నిబంధనలు పాటిస్తూ రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. ఈ పరిశీలనలో జిల్లా ఎస్పీతో పాటు, డి.ఎస్.పి శివ నారా యణ స్వామి , ఆలయ ఉప కమిషనర్ ఈవో వెండిదండి శ్రీనివాస రెడ్డి, సిఐలు డివి నారాయణ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర సంబంధిత పోలీస్ అధికారులు, దేవాలయ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వేంపల్లె - సూర్య వాస్తవం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో ఉమేన్ ఎంపవర్‌మెంట్, ఎన్ఏస్ఏస్ -2 ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నాగేంద్ర మాట్లాడుతూ స్త్రీకి ఉన్నటువంటి అవకాశాలు సద్వినియోగం పరచు కోవాలని కోరారు. విమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ ప్రాచీన కాలంలో స్త్రీలను విలాస వస్తువుగా చూసేవారని అలాగే ఆధునిక కాలంలో స్త్రీలను వివక్షతో చూసేవారని ఈ అసమానతల తోనే స్త్రీలు పురుషులు సమానమని జర్మనీలో వచ్చిన విప్లవమే అందరూ సమానమని ప్రత్యేకంగా ప్రపంచ మంతటా మార్చి 8న అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారని తెలిపారు. ఉమెన్ ఎంపవర్మెంట్ మెంబర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ మహిళల ఎదుగుదలలో ఇల్లు,విద్యాలయాలు ఎనలేని పాత్ర పోషిస్తాయిఅన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ మేంబర్ నీలా కిరణమై మాట్లాడుతూ స్త్రీలకు ప్రాధాన్యత ఇస్తే దానివల్ల వారి కుటుంబమే కాక సమాజం కూడా అభివృద్ధి చెందుతుందిఅన్నారు. ఉమెన్ మెంబెర్ షేక్ రేష్మ మాట్లాడుతూ అందరిని కూడా మనము సమానంగా చూడాలి. ముఖ్య అతిథిగా వచ్చిన వేం ఓపల్లి గవర్నమెంట్ హాస్పిటలు గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రెస్టిల్లా మాట్లాడుతూ మహిళల యొక్క ఆరోగ్యము, ఆహారం ఫిజికల్, మెంటల్, శారీరక అంశాల గురించి మాట్లాడారు. స్త్రీల రుతు సంబంధిత అంశాలు వారి నివారణ చర్యలు ఆహారపు అలవాట్లును గురించి యోగా ఎక్సర్సైజ్‌లు గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో నేషనల్ గోల్డ్ షాటు కప్ సాధించుకు వచ్చిన విద్యార్థిని వల్లెపు మానస కు ప్రోత్సాహక నగదు బహుమతిని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్, డాక్టర్ మాధవరావు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఓబుల్ రెడ్డి,టీవీ అరవింద్, షఫీ ఉద్దీన్, రాజారెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై మరింత నిఘా పెంచాలి

- డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి
- లింగ నిర్ధారణ నిషేధ చట్ట(పిసి పిఎన్డిటి) అమలు కమిటీ తీర్మానం



అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం : అనంతపురం జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా మరింత పటిష్టమైన నిఘా పెంచాలని పిసిపి ఎన్డిటి చట్టం అమలు సలహా కమిటీ తీర్మానించింది. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్వో డాక్టర్ ఈ.బి.దేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం-అనంతపురం జిల్లాలో అమలు అనే అంశంపై సమీక్ష జరిగింది. జిల్లాలో 188 స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయని, వీటిని వైద్య ఆరోగ్య బృందాలు తరచూ తనిఖీలు చేసి లింగ నిర్ధారణ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. జిల్లాలో మరో 9 స్కానింగ్ సెంటర్లు కొత్తవి ప్రారంభించేందుకు, 12 కు రెన్యు వల్ అనుమతి ఇచ్చేందుకు, మరో 20 స్కానింగ్ సెంటర్ల లో సిబ్బంది, యంత్రాల మార్పులకు సమావేశం ఆమోదం తెలిపింది. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భాలు జరగకుండా మహిళా శిశు సంక్షేమ శాఖ ,వైద్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషిచేసి వాటి తగ్గింపులో ముందుండాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డిటి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ దుర్గేష్, చిన్నపిల్లల వైద్య నిపుణులు రవికుమార్, ప్రభుత్వ గైనకాలజిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, రెడ్ సంస్థ ప్రతినిధి అనిత, పెథాలజీ ప్రొఫెసర్ పూర్ణచంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జయలక్ష్మి, నాగ శశిభూషణ్ రెడ్డి, విష్ణుమూర్తి, సురేందర్ రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ. నాగరాజు, డిపిహెచ్ఎన్ఓ ప్రమీల దేవి, లీగల్ కన్సల్టెంట్ సంధ్యారాణి డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య విద్యాధికారి గంగాధర్, డెమో సిబ్బంది వేణుగోపాల్, ఆషా రాణి, , వెంకటేశ్వరరావు, కిరణ్, , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ లోపు వేతనాల పెంపు ప్రకటన చేయాలి

- లేకుంటే 11 నుంచి దశల వారీ ఆందోళనలు
- ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ




వేంపల్లె - సూర్య వాస్తవం : అంగన్వాడీల ఉద్యమంపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలని, ఈ నెల 10 లోపు వేతనాల పెంపు ప్రకటించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి బాదుల్లా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మంజుల జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి ఎఐటియుసి ఏరియా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు లు డిమాండ్ చేశారు. వేంపల్లి లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో చేపట్టిన మహా ధర్నాకు రానివ్వకుండా కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీలపై ప్రభుత్వం నిర్బంధం ప్రకటించడాన్ని తప్పుపట్టారు. తమ ఉద్యమంపై ప్రభుత్వం కనీసం చర్యలకు పిలవకపోవడంతోనే అనివార్యంగా రాత్రిపూట టెంట్లలోనే అంగన్వాడీలు నిద్రించారన్నారు. దీంతో పోలీసులు వచ్చి దాడిచేసి అక్రమంగా అరెస్టు చేశారని, ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. 10వ తేదీలోగా అంగన్వా డీలకు వేతనాలు పెంచుతూ ప్రకటన చేయాలని, లేకపోతే 11న నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపడతా మని హెచ్చరించారు. తమ ఆందోళనకు పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని, ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారని మండి పడ్డారు. మగ పోలీసులు మహిళలని కూడా చూడకుండా బూట్లతో తొక్కారని, ప్రతి మహిళను కనీసం అరడజను మంది పోలీసులు ఒకేసారి చేతులు విరిచి వ్యాన్లోకి కుక్కారని వివరించారు. ప్రతి ఒక్క అంగన్వాడీ మహిళ నొప్పులు భరించలేక హాహాకారాలు చేసినా పోలీసులు వదిలి పెట్టలేదన్నారు. అంగన్వాడీల 10 డిమాండ్లలలో 9 డిమాండ్లు పరిష్కరించామని శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శాసన మండలిలో చేసిన ప్రకటన చేయడం అసత్యమని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం మూడు జీఓలు ఇచ్చినప్పటికీ అవి అసమగ్రంగానే అమలవుతున్నాయని తెలిపారు. 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ కార్మికులకు 2024 జూన్ నుంచి జీతాలు పెంచుతామని ప్రభుత్వం యూని యన్లతో ఒప్పందం చేసుకున్నప్పటికీ... నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. మినీసెంటర్లుకు సంబంధించి ఇంకా 1,800 సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు కావడం లేదని తెలిపారు. మంత్రులు, అధికారులను అనేక సార్లు కలిసినా ఫలితం లేనందున మహాధర్నా చేపట్టాల్సి వచ్చిందని, ఈ సందర్భంగా ప్రభుత్వం మార్చి 9, 10 తేదీల్లో చర్చలకు పిలిచి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశల వారీగా తమ ఆందోళనలకు సిద్ధం కావాలని అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లకు నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకురాలు సరస్వతి శైలజ భాగ్యలక్ష్మి లీలావతి పద్మ పాల్గొన్నారు

తాగు నీటి చలివేంద్రం ఏర్పాటు



పామిడి - సూర్యవాస్తవం : వేసవి కాలంలో దాహం తీర్చడానికి పామిడి పట్టణం లోని కన్నెమూల విద్యా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్, వస్త్ర వ్యాపారులు సంయు క్తంగా తాగునీటి చలివేంద్రాన్ని మెయిన్ బజారులో శనివారం ఏర్పాటు చేశారు. ఆర్ఓ నీటితో ప్రతి సారి కూలర్ నింపుతారు. ఎండాకాలం ముగిసేంతవరకు బాటసారులకు చల్లని నీరు అందిస్తారు. కన్యాకాపరమేశ్వరి దేవాలయం ధర్మకర్త సాయి ప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మారుతీ, నవీన్, గోల్డుస్మిత్ జిత్తు, అంజి నాయక్, రమేష్, గణేష్ ఇతరులు ప్రారంభించారు.

వైసీపీ నాయకుడి కుమార్తె వివాహ వేడుకకు హాజరైన వై.విశ్వేశ్వరరెడ్డి




ఉరవకొండ - సూర్య వాస్తవం: ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామ వాస్తవ్యులు వైసీపీ నాయకుడు లక్ష్మీకాంత్ రెడ్డి కుమార్తె మైత్రి రెడ్డి వెడ్స్ ప్రశాంత్ వివాహ వేడుక హైదరాబాద్లో జరిగింది. శనివారం ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఉరవకొండ వైసీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, వైసీపీ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ




శాంతిపురం - సూర్య వాస్తవం : శాంతిపురం మండలానికి చెందిన తారక్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామాగ్రిని అందజేశారు. పుంగనూరు లోని కేసీపల్లి మరియు అరికెల స్కూల్ లో చదువుతున్న దాదాపు 100 మందికి పైగా విద్యార్థులకు ఈ పరీక్ష సామాగ్రి కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతిపురం లక్ష్మీపతి, హరీష్,ల చేతుల మీదుగా నిర్వహించారు.అలాగే తారక్ అభయ ఫౌండేషన్ జయ కుమార్ హరిగురుచే ఈ కిట్లు విద్యార్థులకు అందించారు. తమ గురువు శ్రీనాథ్ పట్ల ఉన్న అభిమానంతో ఈ సేవా కార్యక్రమాన్ని ఆ స్కూల్లో నిర్వహించామని తెలిపారు.



సీఎం చంద్రబాబును కలిసిన అనంతపురం జిల్లా టీడీపీ నాయకులు

ఉరవకొండ - సూర్య వాస్తవం : అమరావతి ఉండవల్లిలోని తన నివాసంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అనంతపురం జిల్లా ప్రజా ప్రతి నిధులు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పరిశ్రమలశాఖ మంత్రి టీజే భరత్ పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే, శింగనమల, రాయదుర్గం, గుంతకల్ తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి కలిశారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ భేటీలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

యూపీఎస్సీ మెయిన్స్‌లో జెఎన్‌టీయూఏ పూర్వ విద్యార్థినికి 360వ ర్యాంక్



పులివెందుల - సూర్య వాస్తవం : జెఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల పూర్వ విద్యార్థిని రాయలం జయశ్రీ (కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్ - 2019--2023) యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్ష 2025లో 360వ ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. విష్ణు వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. శేష మహేశ్వరమ్మ, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు రాయలం జయశ్రీని అభినందించారు.

రెడ్ల ఐకమత్యానికి కృషి చేస్తా

- రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు
- యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బయ కృష్ణారెడ్డి



కమలాపురం - సూర్య వాస్తవం : రాష్ట్రంలో అఖిల భారత రెడ్డి సంఘం బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని యువజన విభాగ ఉపాధ్యక్షులు బయ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అఖిల భారత రెడ్డి సంఘంలో యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బయ కృష్ణారెడ్డి అను తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామ భూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు పొన్నపురెడ్డి శకుంతల రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. నాయకత్వం అంటే కేవలం ముందు నడవడం కాదు, అందరినీ కలుపుకొని వెళ్లడం అని పేర్కొన్నారు.రెడ్డి సంప్రదాయాల సాక్షిగా, యువత గళమైఅఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తూ, నవ సమాజ నిర్మాణంలో భాగస్వామినవుతానని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నానన్నారు. రంగంలోని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల విశేష ప్రతిభ విద్యార్థుల పట్ల డైరెక్టర్ హర్షం



వేంపల్లె - సూర్య వాస్తవం : ఆర్జియూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులు వికసిత భారత్ యువత పార్లమెంట్-2026 పోటీల్లో విశేష ప్రతిభను కనబరిచారు. విధ్యార్థులు దస్తగిరి బాషా ప్రథమ స్థానంలో నిలిచి రూ.3 వేలు నగదును పొందారు. కంభగిరి స్వామి ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 2 వేలు నగదు పొందినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు వెల్లడించారు. అలాగే లక్ష్మిసిందూర, వెన్నెల, జయంత్, నజీర్ అహ్మద్, పంచెటి సంధ్య జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరి పట్ల డైరెక్టర్ కుమారస్వామి గుప్తా హర్షం వ్యక్తం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విశిష్టమైన విజయాలు సొంతం చేసుకోవాలని డైరెక్టర్ ఆకాంక్షించారు. ట్రిపుల్ ఐటీ అధికారి డా.కోనప్ప పర్య వేక్షణలో విధ్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, అసోసియేట్ డీన్ నవీన్ తదితరులు విధ్యార్థులను ప్రోత్సాహం అందించారు

అమ్మాయి పుట్టినా గర్వంగా
స్వీకరించే భావన సమాజంలో పెరగాలి

- మహిళల సాధికారత, సమాన హక్కులు అవసరం ...
- ఎస్ఎస్బిఎన్ డిగ్రీ కాలేజ్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అనంతపురం - సూర్య వాస్తవం : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నగరంలోని ఎస్ ఎస్ బి ఎన్ డిగ్రీ కాలేజ్ లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డాక్టర్. సింధు ప్రముఖ గైనకాలజిస్ట్ తిరుమల హాస్పిటల్, ఎస్-ఎస్బిఎన్ డిగ్రీ కళాశాల సెక్రటరీ నిర్మలమ్మ , ప్రిన్సిపల్ సరిత ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ, ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి అశ్విని, నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు శైలజ, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై మహిళల సాధికారత, సమాన హక్కుల అవసరం పై వారు మాట్లాడారు.మహిళల ఆరోగ్యం, గౌరవం మరియు సమాజంలో సమానత్వం గురించి చాలా విపులంగా మాట్లాడారు. గర్భాదారణ సమయంలో కొందరు స్కానింగ్ చేయించుకుని బిడ్డ అమ్మాయా, అబ్బాయా అని తెలుసుకోవడానికి ప్రయత్నించడం సమాజంలో ఇంకా జరుగుతున్నటువంటి దురాచారం అని ఆమె పేర్కొన్నారు. బిడ్డ లింగం తెలుసుకోవడం చట్ట విరుద్ధమని, అమ్మాయి పుట్టడం ఎప్పుడూ తక్కువ కాదు అని, ఆమె స్పష్టం చేశారు. ప్రతి బిడ్డ సమానమే అని అమ్మాయిలను అనుగదొక్కే ఆలోచనలను సమాజం విడిచి పెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. అమ్మాయి పుట్టిన గర్వంగా స్వీకరించే భావన సమాజంలో పెరగాలని, మహిళల గౌరవం కాపాడటమే నిజమైన మహిళా దినోత్సవం యొక్క ఉద్దేశమని ఆమె తెలిపారు. ఎస్ఎస్బిఎన్ డిగ్రీ కాలేజ్ సెక్రటరీ నిర్మల మాట్లాడుతూ విద్య మహిళలకు శక్తిని అందించే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. విద్య ద్వారా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎక్సైజ్ సీఐ.అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ముందుకు వస్తే సమాజంలో అనేక మార్పులు సాధ్యమవుతాయని ఆమె అన్నారు.ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి అశ్విని మాట్లాడుతూ మహిళలు బలహీనులు కారు, మహిళలు మార్పు తీసుకురాగల శక్తి కలవారు అని మహిళాభివృద్ధియే సమాజ అభివృద్ధి, మహిళల గౌరవమే దేశ గౌరవం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ బిఎన్ డిగ్రీ కాలేజ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీమతి దేవకి మణి, కో-ఆర్డినేటర్ కె.శారద,మెంబర్స్ పుణ్యవతి ఫిరోజా,శాంతి, మాలతి, జైనువేగం, మంజువాణి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పెద్ద ఎత్తున విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

శింగనమల - సూర్య వాస్తవం : శింగనమల మండలంలోని పెరవలి వద్ద పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ ప్రాజెక్ట్ పరిశీలన నాయనపల్లి క్రాస్ వద్ద పీఎం సూర్య ఘర్ పథకం లబ్ధిదారుల ఇళ్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు. జిల్లాలోని 20 సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సింగనమల పరిధిలోని పెరవలి గ్రామంలో పీఎం కుసుమ్ (గ్రీవీ-ఖఖూఖవీ) పథకం కింద ఏర్పాటు చేస్తున్న 4 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో, మెఘా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సౌర విద్యుత్ ప్రాజెక్ట్ పనులు వేగంగా చేపట్టాలని, జిల్లాలోని 20 సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం నాయనపల్లి క్రాస్ వద్ద పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధిదారుల ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పథకం ద్వారా వినియోగదారులకు, ప్రభుత్వానికి కలిగే ప్రయోజనాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మరియు ఈ పథకానికి మరింత లబ్ధిదారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శేషాద్రి శేఖర్, ఈఈ జె.వి.రమేష్, డీఈ రఘు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





శాంతిపురం - సూర్య వాస్తవం : శాంతిపురం శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ వేడుకలనుఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న శ్రీజ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రెడ్డెమ్మ, గిరిజ, నవీన కుమారి,లు పాల్గొన్నారు. శాంతి పురం మండలం వెలుగు డైరీ ఏపిఎం పార్వతమ్మ, ఏపిఎం శ్రీనివాస్, ఏరియా కోఆర్డి నేటింగ్ ఆఫీసర్ ఏ.రెడ్డప్పరెడ్డి, పాల్గొన్నారు. అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి డైరీ ఏపిఎం పార్వతమ్మ మాట్లాడుతూ మాట్లా డుతూ వెలుగు సంఘాల ద్వారా మహిళలు ఆవులు తీసు కుని నాణ్యమైన పాలను శ్రీజ డైరీకి సరఫరా చేస్తూ మంచి పాల ధరను తీసు కుంటున్నారని కొనియాడారు. మహి ళలు ఆర్థిక అభివృద్ధిలో ముందంజలో ఉన్నారని చెప్పారు. అలాగే ఏరియా కోఆర్డినేటింగ్ ఆఫీసర్ రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ శ్రీజ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థలో పాలు సరఫరా చేసే మహిళల నుంచి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ నుండి చైర్మన్ వరకు అంతా మహిళల సారధ్యంలో శ్రీజ సంస్థ నడుస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థగా ఎదిగిందని చెప్పారు.అలాగే కుప్పం ప్రాంతంలో శ్రీజ మహిళల అభివృద్ధి కోసం 50 ఎకరాల భూమిని తీసుకుని అందులో శ్రీజ క్యాటిల్ ఫీడ్,శ్రీజ పౌడర్ ప్లాంట్ ను అతి తొందరలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ వారి సహకారంతో నిర్మించడానికి కృషి చేస్తుందని తెలిపారు, అలాగే ఏరియా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రెడ్డమ్మ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం శ్రీజ డైరీ అని అన్నారు. సాధారణ మహిళల పాల ఉత్పత్తుదారుల నుంచి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వరకు వారి ఎదుగుదలకు శ్రీజ కృషి చేసిందని చెప్పారు. సంస్థ తీసుకున్న ప్రతి ఒక్క నిర్ణయం శ్రీజ మహిళల అభివృద్ధి కోసమే అని అన్నారు. శ్రీజ పాల నాణ్యత ఆధారంగా ధరతో పాటు ప్రతి ఆర్థిక సంవత్సరంలో బోనస్ మరియు డివిడెంట్ ఆవుల ఆరోగ్యం కొరకు నాణ్యమైన పశువుల దాణా వెటర్నరీ ప్రొడక్ట్స్ ఇస్తున్నారని తెలిపారు. అలాగే గత 12 సంవత్సరాలుగా శ్రీజ సంస్థలో యజమాను రాలిగా ఉంటూ పాలు సరఫరా చేస్తున్న లింగాపురం గ్రామానికి చెందిన జీ.శ్యామలమ్మకి తెలుగువారి సాంప్రదాయం ప్రకారం పసుపు, కుంకు మలతో సన్మానించారు. మహిళా దినో త్సవం సందర్భంగా తమ సంస్థ మహిళలను సన్మానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 లో అత్యధికంగా పాలు సరఫరా చేసి శ్రీజ మెగా మిల్క్ ప్రొడ్యూసర్ అవార్డు తీసుకున్న కర్లగట్ట గ్రామానికి చెందిన భావనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ మహిళా యజమానులు దాదాపుగా 43 మంది పాల్గొన్నారు. వారికి శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ తరపున మిల్లెట్స్ ప్యాకెట్, తేనె, బిస్కెట్స్ అందజేశారు. మరియు ఆవుల ఆరోగ్యం కోసం మినరల్ మిక్చర్, టీఎస్సీని ఒక క్యారీ బ్యాగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా పిఏబి ఎగ్జిక్యూటివ్ ఆలూరి రఘునాథ్ రెడ్డి ఏరియా పశు సంచార వైద్యశాల సిబ్బంది ప్రభావతి, ఏరియా సూపర్‌వైజర్ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

గుత్తిలో.. గుత్తి పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. గుత్తి సీడీపీఓ ఎల్లమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కా ర్యక్రమంలో మహిళల సాధికారత, సమాజ నిర్మాణంలో మహిళల పా త్ర,వారి అభివృద్ధి చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బి, ఎంపీపీ విశాలాక్షి, తహసీల్దార్ పుణ్య వతి,డాక్టర్ రమ్య,ఆయుష్ అంజూ మ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు విద్య,వైద్యం,వ్యాపారం, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృ ద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.మహిళలపై జరుగుతు న్న వివిధ రకాల దాడులు,అన్యా యాలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే కుటుంబం,సమాజం, దేశ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని తె లిపారు.అలాగే సమాజంలో యువ తకు విద్యార్థి దశలో ఉపాధ్యాయు డు ఎంత ముఖ్యమో,అదే విధంగా తల్లి, భార్య,సోదరి,కూతురు వంటి పాత్రల్లో మహిళ ప్రతి వ్యక్తికి మార్గ నిర్దేశకురాలిగా జీవితాంతం ఉంటుం దని వారు అన్నారు.ప్రతి సంవత్స రం మార్చి 8.న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవా న్ని జరుపుకుంటారు.మహిళల హ క్కులు,సమాన అవకాశాలు,సాధి కారతపై అవగాహన పెంపొందిం చడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దే శ్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లక్ష్మీ నారాయణమ్మ,గౌరీ, దస్తగిరమ్మతో పాటు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు,సిబ్బంది పాల్గొన్నారు.





నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఉరవకొండ - సూర్య వాస్తవం : ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు. మహిళల హక్కులు, సమానత్వం, వారి సాధనలు, సమాజంలో వారి పాత్రను గుర్తించేందుకు ఈ రోజును ప్రత్యేకంగా నిర్వహిస్తారు. మహిళలు కుటుంబా నికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి కూడా ఎంతో గొప్ప సేవలు అందిస్తున్నారు. తల్లి, గురువు, వైద్యు రాలు, శాస్త్రవేత్త, రాజకీయ నాయకురాలు వంటి అనేక రంగాలలో మహిళలు తమ ప్రతిభను చూపిస్తున్నారు. పూర్వ కాలం లో మహిళలకు చదువు, ఉద్యోగం వంటి అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. మహిళలు విద్య, విజ్ఞానం, క్రీడలు, వ్యాపారం వంటి అన్ని రంగాలలో పురుషులతో సమా నంగా ముందుకు సాగుతున్నారు. అయితే ఇంకా కొన్ని ప్రాంతా లలో మహిళలు వివక్ష, అన్యాయం వంటి సమస్యలను ఎదు ర్కొంటున్నారు. అందుకే మహిళల హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం ప్రతి సంవ త్సరం మహిళా దినోత్సవం జరుపుకుంటారు. మహిళలు శక్తి, సహనం, ప్రేమకు ప్రతీక. ఒక మహిళ బలంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుంది; కుటుంబం బలంగా ఉంటే సమాజం కూడా బలంగా ఉంటుంది. అందుకే మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. "మహిళా శక్తి - సమాజ శక్తి" అనే భావనతో మహిళలకు గౌరవం ఇవ్వడం మనందరి కర్తవ్యం.

ఘనంగా దుర్గమ్మ గ్రామోత్సవం
- భక్తి శ్రద్ధలతో శ్రీదుర్గాదేవి విగ్రహా ప్రతిష్ట మహోత్సవాలు




వేంపల్లె - సూర్యవాస్తవం : స్థానిక సాయినగర్‌లో వెలసిన శ్రీదుర్గమ్మ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే శ్రీదుర్గాదేవి విగ్రహా ప్రతిష్ట మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ రెడ్డి వెల్లడించారు. శనివారం భక్తి శ్రద్ధలతో సింహావాహన, ధ్వజ, శిఖర, కలశ ప్రతిష్ట, పంచ లోహ విగ్రహా చరప్రతిష్ట మహోత్సవాలను కొనసాగించారు. వేద పండితుల నేతృత్వంలో వివిధ విశేష పూజలు, హోమాలు, మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం చివరి రోజు సందర్భంగా శ్రీదుర్గమ్మ విగ్రహా ప్రతిష్ట, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణం జరుగుతుందని అర్చకులు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

మహిళలను సత్కరించిన స్ఫూర్తి సేవ సంస్థ



డోన్ - సూర్య వాస్తవం: స్థానిక మండల పరిధిలో వెంకటనాయుని పల్లి గ్రామం లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి అధ్య క్షతన స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నాడు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో గ్రామానికి సేవలు అందిస్తున్న 20 మంది మహిళామణులకు స్ఫూర్తి సంస్థ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. మహిళల కృషి, పట్టుదల ఎందరికో స్ఫూర్తిదయకమని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వేలకట్టలేనిది అని స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు అన్నారు. ఈ కార్యక్రమంకి ఆర్థిక సహకారం అందించిన వెంకటనాయునిపల్లి ప్రభుత్వ పాఠశాల టీచర్ రంగనాథ్ కు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి మధు, భాస్కర్, మోహన్ రెడ్డి, చిట్యాల మహమ్మద్, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





ఆకట్టుకుంటున్న

‘ఉస్తాద్ భగత్ సింగ్’ గ్లింప్స్

- అదిరిపోయే అవతార్‌లో కనిపించిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్

సినీ ప్రియులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమా నుంచి తాజాగా విడుదలైన శక్తివంతమైన గ్లింప్స్ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేపుతోంది. పవన్ కళ్యాణ్ అద్భుతమైన, కమాండింగ్ అవతార్‌లో కనిపించిన ఈ గ్లింప్స్.. ప్రేక్షకులు తెరపై చూడటానికి ఇష్టపడే మాస్ ఎనర్జీ, చరిష్మాను సంపూర్ణంగా సంగ్రహించింది. ఈ గ్లింప్స్ విడుదలైన క్షణం నుంచే సామాజిక మాధ్యమాల్లో అద్భుతమైన స్పందన లభిస్తోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, ప్రభావవంతమైన డైలాగులు,శక్తివంతమైన బాడీ లాంగ్వేజ్ అభిమానులు, ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ చిన్న గ్లింప్స్ ఇప్పుడు సినీ ప్రియుల్లో చర్చనీయాంశంగా మారింది.అభిమానులచే ‘కల్ట్ కెప్టెన్’ అని ప్రశంసించబడే దర్శకుడు హరీష్ శంకర్, ప్రేక్షకులు ఆరాధించే విధంగా పవన్ కళ్యాణ్‌ను మరోసారి ఉత్తేజపరిచే రీతిలో ప్రదర్శించడంలో సఫలమయ్యారు. ఈ గ్లింప్స్ సినిమా యొక్క తీవ్రతను, పవర్ స్టార్ పాత్రను మరింత బలంగా చూపించే విధంగా రూపొంది ంచబడింది.గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనపై చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఇది చిన్న భాగం మాత్రమేనని, త్వరలో విడుదల కానున్న ట్రైలర్‌తో మరింత ఉత్సాహం పెరుగుతుందని చిత్రబృందం హామీ ఇచ్చింది.

రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి పాటలను స్వరపరచగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ప్రేక్షకులను డ్యాన్స్ చేయిస్తే, తమన్ తన నేపథ్య సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళనున్నారు. ఈ సంగీత ద్వయం ప్రేక్షకులకు ఒక గొప్ప సంగీత అనుభవాన్ని హామీ ఇస్తోంది.‘గబ్బర్ సింగ్’ తరువాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ‘ఉస్తాద్ భగత్ సింగ్’పై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభించింది.తాజాగా విడుదలైన గ్లింప్స్ కూడా ఆకట్టుకోవడంతో ‘ఉస్తాద్ భగత్ సింగ్’పై అంచనాలు పెరుగుతున్నాయి. త్వరలోనే ట్రైలర్ విడుదల కానుండగా, సినిమాపై ఉత్సాహం మరింత పెరగనుంది.

‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉత్సాహం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి మార్చి 19వ తేదీన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ థియేటర్లలో అడుగుపెట్టనుంది.

‘రాకాస’ నుంచి ఆకట్టుకునే ‘రపప్పా.. రపప్పా’ అంటూ సాగే పాట విడుదల

ఏప్రిల్ 3న మూవీ గ్రాండ్ రిలీజ్

‘కమిటీ కుర్రోళ్లు’ చిత్రంతో ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల ఎన్నో అవార్డుల్ని, రివార్డుల్ని అందుకున్నారు. అలాంటి ఓ అద్భుతమైన సినిమా తరువాత జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ‘రాకాస’ మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో రిలీజ్ చేసిన ‘రాకాస’ గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇంత వరకు చేసిన ప్రమోషనల్ కార్యక్రమాలు ఆడియెన్స్‌ని ఆకట్టుకున్నాయి. ఇక ఈ టీం మ్యూజికల్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేసింది. ‘రపప్పా.. రపప్పా’ అంటూ సాగే ఈ పాట ఎంతో చక్కగా ఉంది. హీరోయిన్ పట్ల హీరోకి ఉన్న ప్రేమ, తనకి బదులుగా వేరే వాడ్ని పెళ్లి చేసుకుంటోన్న తరుణంలో హీరోయిన్ గురించి హీరో చెప్పడం, తన బాధను వివరించడం ఈ పాటలో కనిపిస్తోంది. ఆ బాధని కూడా ట్రెండీ పదాలతో, చాలా ఫన్నీగా చెప్పే ప్రయత్నం చేశారు.

అనుదీప్ దేవ్ అందించిన బాణీ, రఘురాం సాహిత్యం, రామ్ మిర్యాల గాత్రం ఈ పాటను మరింత స్పెషల్‌గా మార్చేశాయి. ప్రస్తుతం ఈ పాట మ్యూజికల్ లవర్స్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి రాజు ఎదురోలు సినిమాటోగ్రఫర్‌గా, ఎడిటర్‌గా అన్వర్ అలీ పని చేశారు.



ముచ్చటగా మూడో టైటిల్ కొట్టేనా...



- డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ కప్ కొడితే పలు రికార్డులు నమోదు
- నేడు న్యూజిలాండ్‌తో తుది పోరు
- రాత్రి 7.00గం॥ల నుంచి

అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్ టైటిల్ పోరుకు రంగం సిద్ధమైంది. నరేంద్ర మోడీ స్టేడియంలో ఆదివారం జరిగే టైటిల్‌కోసం భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ ట్రోఫీని భారతజట్టు గెలిస్తే పలు రికార్డులను నెలకొల్ప నుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ ఈ టైటిల్ గెలిస్తే వరుసగా రెండోసారి ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నట్లవుతుంది. అలాగే మూడుసార్లు ఈ టైటిల్‌ను గెలిచిన జట్టునూ నిలవనుంది. ఆతిథ్య హోదాలో టైటిల్ సాధించిన జట్టుగానూ రికార్డు నెలకొల్పనుంది. 2007 నుంచి ఇప్పటివరకు 9 టి20 ప్రపంచకప్ టోర్నీలు జరగ్గా.. వీటిలో ఒక్కసారి కూడా ఆతిథ్య జట్టు టైటిల్ గెలిచిన దాఖలాలు లేవు. అలాగే వరుసగా రెండుసార్లు టైటిల్ కొట్టిన జట్టు ఏదీ లేదు. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా టైటిల్ గెలిచి పలు రికార్డును నమోదు చేయాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. టీమిండియా టైటిల్‌ను సాధిస్తే మూడుసార్లు టి20 ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన తొలి జట్టుగానూ రికార్డుపుటల్లోకెక్కనుంది. ఇప్పటివరకు భారత్, ఇంగ్లండ్, వెస్టిండీస్ జట్లు రెండేసిసార్లు టైటిళ్లను సాధించగా.. శ్రీలంక, పాకిస్తాన్, ఆస్ట్రేలియా ఒక్కో సారి మాత్రమే ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాయి. ఇక న్యూజిలాండ్ జట్టు టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఇదే రెండోసారి మాత్రమే. ఇంతకుముందు 2021లో ఫైనల్‌కు చేరినా ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌కే పరిమితమైంది. భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటి వరకు 30 టి20ల్లో ముఖాముఖి తలపడగా.. భారత్ 18మ్యాచుల్లో న్యూజిలాండ్ 11మ్యాచుల్లో విజయం సాధించాయి. ఒక మ్యాచ్ టై కాగా... స్వదేశంలో టీమిండియా 11 మ్యాచుల్లో గెలిస్తే.. కివీస్ 4 టి20ల్లో విజయం సాధించింది. న్యూజిలాండ్ గడ్డపై భారత్ 7, భారత గడ్డపై న్యూజిలాండ్ 5 మ్యాచుల్లో సత్తా చాటాయి. తటస్థ వేదికల్లో కివీస్ 2 మ్యాచ్‌లు గెలిచింది. ఇక టి20 ప్రపంచకప్‌లో ఈ రెండు జట్లు మూడుసార్లు తల పడగా.. మూడు సందర్భాల్లోనూ కివీస్‌దే విజయం.

తడబడుతూనే ఫైనల్‌కు టీమిండియా..

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారతజట్టు తడబడుతూనే ఫైనల్‌కు చేరింది. ఈ టోర్నీకి ముందు టి20 ఫార్మాట్‌లో విధ్వంస బ్యాటింగ్‌తో చెలరేగిన అభిషేక్ శర్మ.. మెగా టోర్నీలో ఒక్కసారిగా ఫామ్ కోల్పోయాడు. ఇక మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్ పరిస్థితి కూడా అంతే దారుణంగా ఉంది. మరోవైపు శివమ్ దూబే బంతితో ధారాళంగా సమర్పించుకుంటున్నాడు... ఇలాంటి సమస్యలు మన జట్టును వేధిస్తున్నాయి. సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 253 పరుగుల భారీ స్కోర్ చేసినా.. గెలిచింది కేవలం 7పరుగుల తేడాతోనే. ఇది భారత శిబిరాన్ని కలవరపాటుకు గురి చేస్తోంది. మరోవైపు సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై భారీ విజయంతో న్యూజిలాండ్ రెట్టించిన ఉత్సాహంతో ఫైనల్‌లో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో తుదిపోరులో ప్రత్యర్థి జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.

ఫైనల్‌కు బ్యాటింగ్ పిచ్ సిద్ధం...

టి20 ప్రపంచకప్ ఫైనల్ కోసం బ్యాటింగ్ పిచ్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భారత జట్టు యాజమాన్యం పక్కా వ్యూహంతో వ్యవహరిస్తోంది. ఫైనల్ మ్యాచ్ కోసం ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కూడిన ‘మిక్స్‌డ్ సాయిల్’ పిచ్‌ను ఉపయోగించారు. ముంబయిలో ఇంగ్లండ్‌తో జరి గిన సెమీఫైనల్ తరహాలోనే ఇది కూడా హై-స్కోరింగ్ మ్యాచ్‌కు వేదిక కానుంది. ముఖ్యంగా ఈ పిచ్‌లో నల్లమట్టి కంటే ఎర్రమట్టిని ఎక్కువగా వాడారు. ఎర్రమట్టి కారణంగా పిచ్‌పై బంతికి మంచి బౌన్స్ లభిస్తుంది. దీంతో రెండు ఇన్నింగ్స్‌ల లోనూ బ్యాటింగ్ సులువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్పిన్నర్లకు పెద్దగా సహకారం లభించక పోవచ్చని, ఈ పిచ్‌పై 200 పరుగులు సాధారణ స్కోర్‌గా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పిచ్ టీమిండియా దూకుడైన బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతుందని, సంజూ శాంసన్, అభిషేక్ వంటి బ్యాటర్లు కీలక పాత్ర పోషించడానికి ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. ఈ మైదానంలో లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా 213 పరుగులు చేస్తే.. కెనడా 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసి ఓటమిపాలైంది.

జట్లు(అంచనా)..

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్, సంజు శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, దూబే, హార్దిక్, అక్షర్, బుమ్రా, రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి.

న్యూజిలాండ్: సాంట్నర్(కెప్టెన్), షెఫర్ట్(వికెట్ కీపర్), అలెన్, రచిన్ రవీంద్ర, ఫిలిప్స్, చాప్మన్, మిఛెల్, నీషమ్, కోంచీ, హన్రీ, ఫెర్గుసన్.

మల వ్యర్థాలతో విసిగిపోయిన కాలనీవాసులు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- 500 ఇళ్ల మలిన జలాలు కాలనీలోకి...
- భూపయ్య కాలనీ-ఫైర్ ఆఫీస్ వీధి వాసుల ఆవేదన
- అతి పెద్ద అపార్ట్మెంట్ మల వ్యర్థాలు కాలనీలోకి...
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
- పన్నులు వసూలు చేయడంలో కఠినం...
- సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం
- ఏడాది నుంచి వేధిస్తున్న డ్రైనేజీ సమస్య...

అధికారులపై కాలనీవాసుల ఆగ్రహం



నాయుడుపేట – సూర్య వాస్తవం : తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని భూపయ్య కాలనీ ఫైర్ ఆఫీస్ వీధిలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని అవని హోమ్స్ అపార్ట్మెంట్ సముదాయం నుంచి దాదాపు 500 ఇళ్లకు సంబంధించిన మానవ మల వ్యర్థాలను మోటార్ల ద్వారా నలిపి క్రషింగ్ చేసి, ఆ మలిన జలాలను కాలనీలోని చిన్న డ్రైనేజీ కాలువలోకి పంపిస్తున్నారని కాలనీవాసులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కాలనీలో ఉన్న ఈ డ్రైనేజీ కాలువ అసలు సాధారణ వేస్ట్ వాటర్ వెళ్లేందుకు మాత్రమే ఏర్పాటు చేయబడినదని, అది కూడా కేవలం రెండు అడుగుల వెడల్పు ఉన్న చిన్న కాలువ మాత్రమేనని స్థానికులు చెబుతున్నారు. అయితే భారీగా వచ్చే మలిన జలాలను అదే కాలువలోకి పంపించడం వల్ల కాలనీ అంతటా తీవ్ర దుర్వాసన వ్యాపిస్తూ ప్రజల జీవనం దుర్భరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూపయ్య కాలనీలో ప్రధానంగా దిగువ – మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. మల వ్యర్థాలు కాలువలోకి రావడంతో దోమలు పెరగడం, చెత్త వాసనలు వ్యాపించడం, చిన్నపిల్లలు మరియు వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. కాలనీ మొత్తం అస్వచ్ఛతతో నిండిపోతుండడంతో ఎప్పుడైనా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు నాయుడుపేట మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో హౌస్ టాక్స్, వాటర్ టాక్స్ వంటి పన్నులు వసూలు చేయడంలో మాత్రం అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. పన్నులు చెల్లించడంలో కొద్దిగా ఆలస్యం జరిగినా వెంటనే పైప్ లైన్లు కట్ చేయడం, డమ్మీలు వేయడం, కొళాయి నీళ్లు నిలిపివేయడం, వీధి లైట్లు ఆపివేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారని వారు తెలిపారు. అయితే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో మాత్రం అదే అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం తెలియపరిచారు. అవని హోమ్స్ నుంచి వచ్చే మానవ మల వ్యర్థాలను కాలనీలోని డ్రైనేజీ కాలువలోకి పంపకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని, కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని భూపయ్య కాలనీ ఫైర్ ఆఫీస్ వీధి నివాసులు నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు మాట్లాడుతూ చెప్పారు.





చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై
సమతుల్య విధానం అవసరం

- పుస్తకావిష్కరణ సభలో ఆర్జేడీ కె. శామ్యూల్ వెల్లడి



అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం : సోషల్ మీడియా వినియోగం పిల్లల మానసిక ఆరోగ్యం, విద్యా ఫలితాలు, ప్రవర్తనపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నందున వారి భద్రతను పరిరక్షించే సమతుల్య విధానం అవసరమని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కె. శామ్యూల్ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటిలోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి రచించిన “16 ఏళ్లలోపు చిన్నారుల సోషల్ మీడియా వినియోగం -- నియంత్రణ” అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో చౌకైన డేటా సేవలు, స్మార్ట్‌ఫోన్‌ల విస్తరణ కారణంగా చిన్నారుల సోషల్ మీడియా వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. డిజిటల్ ప్రపంచం చిన్నారులకు విద్యా అవకాశాలు, సృజనాత్మకత అభివృద్ధి, ప్రపంచంతో అనుసంధానం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, అదే సమయంలో మానసిక ఆరోగ్యం, సైబర్ భద్రత, డిజిటల్ వ్యసనం వంటి అనేక సవాళ్లను కూడా తీసుకొస్తోందన్నారు. ఈ నేపథ్యంలో చిన్నారుల సోషల్ మీడియా వినియోగాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 16 ఏళ్లలోపు చిన్నారులు డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు అవసరమైన సమగ్ర విధాన వ్యవస్థను రచయిత మడితాటి నరసింహారెడ్డి తన పుస్తకంలో స్పష్టంగా వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మడితాటి నర సింహా రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పుస్తక రచయిత మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆన్‌లైన్ భద్రతపై జరుగుతున్న చర్చలకు ఈ పుస్తకం అర్థవంతమైన దిశానిర్దేశం అందించి, భద్రతతో కూడిన, బాధ్యతాయుతమైన డిజిటల్ వాతావరణ నిర్మాణానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రాజు, ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య తదితరులు

అటవీ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



కడప – సూర్యవాస్తవం : కడప జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ (ఐఎఫ్ఎస్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ శాఖ ఆధ్వర్యంలో కడప జిల్లాలో అటవీ సిబ్బందికి సర్వే విధానాలు, ఆధునిక సర్వే సాంకేతికతలు, వేసవి కాలంలో అటవీ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ (ఐఎఫ్ఎస్) ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. కడప జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ (ఐ ఎఫ్ ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో అటవీ శాఖతో పాటు ఫైర్ డిపార్ట్‌మెంట్ మరియు సర్వే డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. అటవీ ప్రాంతాల పరిరక్షణలో సర్వే ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఆధునిక సర్వే సాంకేతిక పద్ధతులు, జీపీఎస్ ఆధారిత మ్యాపింగ్, డిజిటల్ డేటా సేకరణ వంటి అంశాలపై అటవీ సిబ్బందికి ప్రాక్టికల్ మార్గ దర్శకాలు అందించారు. వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అటవీ అగ్ని ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం, నివారణ చర్యలు తీసుకోవడం, ఫీల్డ్ స్థాయిలో సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అటవీ అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ డిపార్ట్‌మెంట్‌తో సమన్వయం ఎలా ఉండాలో, అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షణను ఎలా బలోపేతం చేయాలో నిపుణులు సిబ్బందికి వివరించారు. అటవీ సంపదను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అటవీ సిబ్బంది అప్రమత్తంగా పని చేయాలని జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ (ఐఎఫ్ఎస్) అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ బసివి రెడ్డి, ఇతర సిబ్బంది, సర్వే డిపార్ట్‌మెంట్ నుంచి శివ ప్రసాద్, బాలాజీ ఇతర అధికారులు పాల్గొన్నారు. అటవీ శాఖకు సబ్ డిఎఫ్ఓ ప్రొద్దుటూరుడ బద్వేల్ ఫారెస్ట్ రేంజ్ అధికారుల నుంచి ఏబీఓల వరకు పలువురు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా అటవీ పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సిబ్బందికి అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు.



అంగన్వాడీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

- పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం

పెళ్లకూరు – సూర్య వాస్తవం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా నాయుడుపేట పరిధిలోని పెళ్లకూరు మండలం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర స్థాయి (షుగర్) వంటి పరీక్షలతో పాటు ఇతర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు అంగన్వాడీ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు ఇచ్చారు. రోజువారీ పనిలో బిజీగా ఉండే అంగన్వాడీ కార్యకర్తలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల సంక్షేమానికి కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరం అంగన్వాడీ సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుజాత ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్ సాయి లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

వేగవంతం చేసిన జనసేన “ఉద్యమి” సభ్యత్వ నమోదు

ఉరవకొండ – సూర్య వాస్తవం : జనసేన పార్టీ నిర్వహిస్తున్న “ఉద్యమి” సభ్యత్వ కార్యక్రమం మూడు రోజులు మాత్రమే గడువు ఉన్నందున జనసేన పార్టీ అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగస్వాములు కావా లని ఉరవకొండ నియోజకవర్గ జనసేన పార్టీ నేతలు రాయంపల్లి రమేష్, చంద్ర శేఖర్, గుడిసెల రాజేష్, దేవేంద్ర పిలుపునిచ్చారు. జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన “ ఉద్యమి “సభ్యత్వం తీసుకున్న వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రమాద బీమా సదుపాయం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం సంభవించిన పక్షంలో రూ. 5 లక్షల వరకు బీమా వర్తిస్తుందని, అదేవిధంగా ఉరవకొండ నియోజకవర్గంలోని జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు తప్పనిసరిగా ఈ ఉద్యమి సభ్యత్వాన్ని తీసుకోవాలని నాయకులు కోరారు.



డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

- ఎస్ఐ శ్రీకాంత్
- ఐదుగురికి రూ.50 వేల జరిమానా విధించిన నాయుడుపేట కోర్టు

ఓజిలి – సూర్య వాస్తవం : రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు చేపడు తున్నారు. తిరుపతి జిల్లా ఓజిలి మండలంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఓజిలి మండలంలో ఎస్సై కే.శ్రీకాంత్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని నాయుడుపేట కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన జడ్జి మీనాక్షి నిందితులపై ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేల జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, ఇలాంటి చర్యలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతాయని కోర్టు పేర్కొంది. అదేవిధంగా భవిష్యత్తులో మళ్లీ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుని జైలు శిక్ష విధించాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది. ప్రజలు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI)

ఆపరేషన్ వజ్రప్రహార్ చేపట్టిన పోలీసులు..

- మెగా కార్డెన్ డే, కార్డెన్ సర్చ్ ఆపరేషన్లో డీఎస్పీ రవిబాబు
- రికార్డులు సరిగా లేని 20 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం
- పాత కేసు నిందితులను హెచ్చరించిన డీఎస్పీ
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు : డీఎస్పీ రవిబాబు



రాయదుర్గం - సూర్య వాస్తవం : రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వుల మేరకు, ఈగల్ చీఫ్ ఐజి పిఆర్‌కె రవికృష్ణ, పర్యవేక్షణలో అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు రాయదుర్గం టౌన్ కోతి గుట్ట ఏరియా, చంద్రబాబు కాలనీ లో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి రవిబాబు మాట్లాడుతూ.... ఉన్నత అధికారులు ఆదేశాలకు మేరకు రాయదుర్గం పట్టణంలోని కార్డెన్ సర్చ్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసులు పటిష్టంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో రాయదుర్గం సీఐ జయ నాయక్ స్పెషల్ టీం, పోలీస్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టగా 20 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు పత్రాలు సరిగా లేక సీజ్ చేసినట్లు డీఎస్పీ రవిబాబు పేర్కొన్నారు. పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు గుర్తించి విచారణ చేపట్టామని పాత కేసులో ఉన్న నేరస్తుల కదలికలపై సమాచారం సేకరించామని అక్రమ కార్యకర్తలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతామని పాత నేరస్తులకు డిఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలను బలోపేతం చేయడానికి ఈ ఆపరేషన్ చేపట్టామని గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు దొంగతనాలు రౌడీ కార్యకలాపాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామన్నారు. భవిష్యత్తులో యువత నాశనంతో పాటు మీ కుటుంబాలపై తీవ్రప్రభావం పడుతుందన్నారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రతి వ్యక్తి పాత్ర కీలకమని గంజాయిని అరికట్టడంలో మనకెందుకు అనే భావనను వీడనాడాలని డీఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ వజ్రప్రహార ప్రతిజ్ఞలో, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సమాజాన్ని ప్రజల సహకారంతో ప్రశాంతత సమాజాన్ని నిర్మాలించడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని డిఎస్పి రవిబాబు విజ్ఞప్తి చేశారు.

గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధిత సమాచారం ప్రజలు ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వ్యక్తులను గోప్యంగా ఉంచుతామని డిఎస్పి ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు జయ నాయక్,వెంకటరమణ, గణేష్ ఎస్సై ప్రసాద్ సురేష్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.




ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టకు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వినతి



శింగనమల- సూర్య వాస్తవం : భారతీయ జనతా పార్టీ శింగనమల నియోజకవర్గం కో-కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పత్రికాముఖంగా వినతి. మన భారత దేశములో ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, 17వ శతాబ్దపు మొఘలుల పాలిట సింహస్వప్నం. ఆయన కేవలం రాజు మాత్రమే కాదు, సనాతన ధర్మాన్ని కాపాడటానికి జన్మించిన యుగపురుషుడిగా ప్రసిద్ధి గాంచాడు. ఆయన జననం బాల్యం (1630) ఫిబ్రవరి 19న పూణే సమీపంలోని శివనేరి కోటలో జననం తల్లి జీజాబాయి ధైర్యం దేశభక్తి నేర్పితే తండ్రి షాజీ భోంస్లే చిన్నతనంలోనే రామాయణం మహాభారతం అధ్యయనం నేర్పించారు. స్వరాజ్య స్థాపన (1645-1674) 16 ఏళ్ల వయసులో తోరణ దుర్గాన్ని స్వాధీనం చేసుకుని తొలి అడుగు గెరిల్లా యుద్ధ (గనిమి కావా) నైపుణ్యంతో బీజాపూర్ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్నారు. 1674 జూన్ 6న రాయ్గఢ్ కోటలో ఛత్రపతిగా పట్టాభిషేకం జరిగింది. సుగుణాల సమ్మేళనం అఫ్జల్ఖాన్ వధ (బుద్ధి, సాహసం) వంటి సంఘటనలు ప్రసిద్ధం. స్త్రీల పట్ల గౌరవం, మత సహనం, ప్రజల పట్ల కరుణ కలిగిన పాలకుడు. గురుత్వాకర్షణ తల్లి జీజాబాయి తొలి గురువు . ఆధ్యాత్మిక గురువు సమర్థ రామదాసు ప్రభావం అపారం. శివాజీ మహారాజ్ ఒక గొప్ప యోధుడు, దూరదృష్టి గల పాలకుడు, ధర్మరక్షకుడు. ఆయన జీవితం మనకు ధైర్యం, నాయకత్వం, సమర్థవంతమైన పాలన గురించి నేర్పిస్తుంది. ఆయన హిందూ ధర్మాన్ని సంరక్షించిన పోరాట యోధుడు కావున ఆయన విగ్రహాలు దేశములో ఉన్న అన్ని రాష్ట్రాలలో అన్ని మండల కేంద్రంలలో విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రికి మా వినతి అని శ్రీనివాసులరెడ్డి పత్రికముఖంగా విన్నవించుకున్నాడు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వి చెన్నారెడ్డి,రామనాథ రెడ్డి,నాగప్ప,మధుసూదన్ రెడ్డి,ఉత్తమ రెడ్డి, రాజశేఖర్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంపై అవగాహన ర్యాలీ

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి దేవి



సింహాద్రిపురం - సూర్య వాస్తవం: మహిళల భద్రత, సమాన హక్కులు, మహిళలపై జరిగే అఘాయిత్యాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందని సింహాద్రిపురం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి దేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో ఆదేశాల మేరకు సింహాద్రిపురం మండలంలోని అంగన్వాడి సెంటర్ పరిధిలో గర్భవతులు, బాలింతలు, లబ్ధిదారులను సమావేశపరిచి ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి దేవి, అంగన్వాడి కార్యకర్తలు రామ తులసి, రామజ్యోతి, అనిత, సాధాహిని, రాజేశ్వరి, నూర్జహాన్, అనసూయమ్మ, రత్నబాయి, ఇతర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాక్రీట్' సంస్థపై క్రిమినల్ కేసు నమోదు

- పులివెందులలో జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణంలో నిర్లక్ష్యం అవకతవకలు - డీఎస్పీ మురళి నాయక్



పులివెందుల - సూర్య వాస్తవం: పులివెందుల పట్టణంలో జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణంలో నిర్లక్ష్యం, అవకతవకల కారణంగా రాంక్రీట్ సంస్థ పై పోలీసులు కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేద ప్రజల కోసం జగనన్న హౌసింగ్ కాలనీ పేరుతో పులివెందులలో ఇళ్ల నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సంబంధిత కాంట్రాక్టు సంస్థపై హౌసింగ్ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పులివెందుల డిఎస్పి మురళీ నాయక్ పత్రిక విలేకరుల సమావేశంలో తెలియజేస్తూ 2021లో గత ప్రభుత్వం పులివెందుల పట్టణంలో గృహ నిర్మాణాల కోసం టెండర్లు పిలిచి రాంక్రీట్ అనే ప్రైవేట్ సంస్థకు 4912 ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించగా రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ,గడువు ముగిసినా నేటికీ లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాలన్న విజిలెన్స్ విచారణలో నిర్మాణాల్లో తీవ్ర అవకతవకలు జరిగినట్లు తేలిందని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మరియు అక్రమాల వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.6 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని డిఎస్పి తెలిపారు.జిల్లా హౌసింగ్ అధికారి వి.రాజారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రాక్రీట్ సంస్థ మరియు సైట్ ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డిపై క్రైమ్ నెంబర్ 44/2026 కింద కేసు నమోదు చేసి భారతీయ న్యాయ సంహిత పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ షల్కే నచ్కేత్ ఆదేశాల మేరకు లోతైన దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి మురళీ నాయక్ స్పష్టం చేశారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

- ముఖ్యమంత్రి సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోట్ల, జిల్లా కలెక్టర్ రాజకుమారి, యాదవ్ డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు

ప్యాపిలి - సూర్య వాస్తవం: డోన్ ప్యాపిలి మండలం కొత్తబురుజు గ్రామంలో మార్చి 09వ తేదీన రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు జిల్లా నుండి ప్రతి ఒక్క టీడీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సభా ప్రాంగణము కార్యక్రమ ఏర్పాట్లను డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా ఎస్పీ, సీఎంఓ పెందుర్తి వెంకటేశ్వర్లు వలసల రామకృష్ణుడు వెంకటం పల్లి శ్రీనివాసులు మొదలైన టిడిపి నాయకులతో, కార్యకర్తలతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వై.నాగేశ్వరరావు యాదవ్. టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షురాలి తండ్రిని పరామర్శించిన మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి



పులివెందుల - సూర్య వాస్తవం: కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి తండ్రి నతానియల్ నరాల సంబంధమైన సమస్యలతో, వయోభారంతో కడపలో జగదీష్ న్యూరో కేర్ ఆసుపత్రిలో గత కోద్ది రోజులుగా చికిత్స చేయించుకుంటున్నారు. ఈ విషయం తెలిసిన పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి రెడ్డి, పరామర్శిస్తూ, విజయ జ్యోతి ని అడిగి నతానియల్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటూ, భగవంతుని దయతో తొందరగా ఆరోగ్యం కోరుకోవాలని వారితో పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాదర్ రాయపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల నిర్లక్ష్యం

- కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- లింగాల గ్రామ ప్రజల ఆవేదన



పులివెందుల - సూర్య వాస్తవం: పులివెందుల నుంచి వయా తిమ్మంపల్లి తాడిపత్రి మీదుగా వెళ్లే బస్సును పులివెందుల పార్సపల్లె బస్టాండ్‌లో డ్రైవర్ ఆపగా కండక్టర్ లింగాల వాళ్ళు మాత్రం బస్సుల ఎక్కకండి హుకుం జారీ చేశారు. లింగాల మండలం అయిఉండి లింగాల గ్రామస్తులు ఎవరేగాని బస్సు ఎక్కకూడాదని కండక్టర్ హుకుం జారీ చేయడంతో అక్కడ ఉన్న లింగాల గ్రామ ప్రజలు దిక్కు తెలియక ఆ బస్సు ఎక్కకుండా మరో బస్సుకు వారు వచ్చారు.లింగాల గ్రామస్తులు బస్సు ఎక్కకుండా వద్దన్న కండక్టర్ పై చర్యలు తీసుకోవాలని లింగాల గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆర్టీసీ బస్సులు ఉన్నది ప్రయాణికులు ఎక్కించుకోవడానికి కండక్టర్ ఇష్టానుసారం ప్రవర్తించడానికి అని ప్రశ్నించారు. సంబంధిత డిపో మేనేజర్ వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయ మహిళ ఉద్యోగులకు సన్మానం



పులివెందుల- సూర్య వాస్తవం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల మున్సిపాలిటీలోని కే.వెలమవారిపల్లి సచివాలయంలో శనివారం ముందస్తు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.సచివాలయ అడ్మిన్ నాగలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సేవలను కొనియాడారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్యదర్శులు ఎస్.పర్వీన్ బేగం (మహిళా సంక్షేమ కార్యదర్శి),దూస లక్ష్మి ఏఎన్ఎమ్ (బండి లక్ష్మి (శానిటరీ కార్యదర్శి) లను సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి, కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మున్సిపల్ అధికారులు ఆర్వో మహబూబ్ బాషా, డిఈ కిరణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఏపిఎంబి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు సచివాలయ సిబ్బంది జి. గణేష్, ఎస్.బాబు, ఎస్.అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొని మహిళా ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

యల్లనూరు మండలంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విస్తృత పర్యటన

శింగనమల- సూర్య వాస్తవం : యల్లనూరు మండలం కూచివారిపల్లిలో మాజీ మంత్రి, శింగనమల వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి సాకే శైలజనాథ్ విస్తృతంగా పర్యటించారు. వైసీపీ శ్రేణుల ఇళ్లకు వెళ్లి కార్యకర్తలను నియోజక అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు.ఆయన గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కార్యకర్తలు నాయకులు అందరు తమవంతు సహకారం అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ప్రజలకు తెలిచేయాలని వైసీపీని మరింత శక్తివంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



- అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు ఆపరేషన్ వజ్రప్రహార్...!
- యువత మాదకద్రవ్యాలను వదిలి సానుకూల మార్గంలో జీవించాలి
- చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ పి.జగదీష్

మాదకద్రవ్యాల నిర్మూలనే
లక్ష్యంగా జిల్లా ఎస్పీ అడుగులు



అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం : యువత మత్తు పదార్థాలకు బానిసలై, భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని, మాదక ద్రవ్యాల రహిత సమాజంగా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వుల మేరకు ఈగల్ చీఫ్, ఐజీపీ ఆకే రవి కృష్ణ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో శనివారం నాడు అనంతపురం పట్టణంలో స్థానిక షికారి కాలనీ, బుడ్డప్ప నగర్ లలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టబడ్డాయి. ఈ మెగా ఆపరేషన్ లో జిల్లా ఎస్పీతో పాటు ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విని మణిదీప్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన ఈ హాట్‌స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కాలనీలలో పార్క్ చేసిన వాహనాలపై తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తదితర వాహనాల రికార్డులు, పత్రాలు పరిశీలించి పత్రాలు సరిగా లేని 24 టూవీలర్లు, 2 ఆటోలను ఎస్పీ ఆదేశాలతో సీజ్ చేశారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి విచారణ చేపట్టారు. పాత కేసుల్లో ఉన్న నేరస్తుల కదలికలపై సమాచారం సేకరించారు. అక్రమ కార్యకలాపాలపై నిఘా ఉంచారు. ఓ ఇంట్లో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన అక్రమ మద్యం బాటిళ్లు 15 స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ స్థానికులతో సమావేశమై మాట్లాడుతూ.... జిల్లాలో శాంతి భద్రతలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టామన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, దొంగతనాలు, రౌడీ కార్యకలాపాలు మరియు ఇతర చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పాత పంథా కొనసాగించాల నుకుంటే షీట్లు ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా కొనసాగించి చట్టపరంగా గట్టి చర్యలు ఉంటాయన్నారు. ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ముఖ్యంగా యువత మేల్కోవాలి. ఒకసారి పెడదోవను ఎంచుకుంటే ఆ కుటుంబాలు ఎలా నాశనమౌతాయో గుర్తించాలి. మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుందని, విద్య, ఉద్యోగం, కుటుంబ అభివృద్ధి మరియు ఆరోగ్య పరిస్థితులపై ప్రభావితం చేస్తుందని వివరించారు. యువత మాదకద్రవ్యాలను వదిలి సానుకూల మార్గంలో జీవించాలి. ఇది వ్యక్తిగత భవిష్యత్తు, కుటుంబం, సమాజం కోసం అవసరం. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రతి వ్యక్తి పాత్ర కీలకం. గంజాయిని అరికట్టడం మనకెందుకులే అనే భావనను విడనాడాలి. సమాజంలో పరివర్తన, బాధ్యతాయుతమైన జీవనశైలిని ప్రేరేపించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి. అదేవిధంగా... ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి " ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ " నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిఐలు వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, జగదీష్, వెంకటేష్ నాయక్, జయపాల్ రెడ్డి, ఈగల్ ఆర్ఎస్ఐ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.






కమనీయం.. ఖాద్రీశుడి మోహిని ఉత్సవం

-వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం : నవ నరసింహ క్షేత్రాలలోకెల్లా ఒకటైన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం రాత్రి నరసింహస్వామి లి"మోహిని అవతార పల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి పట్టణంతో పాటు కదిరి ప్రాంతం పరిసర ప్రజలు వేలాది సంఖ్యలో తరలిరావడంతో ఆలయ వీధులు నిండి పోయాయి గోవింద నామస్మరణల మధ్య నరసింహస్వామి మోహిని అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కలిగించడాన్ని భక్తులు అదృష్టంగా భావించారు. ఈ ఉత్సవంలో ఆలయ ఉప కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి ఆర్ డి ఓ వివిఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తత్వవేత్తల దృష్టిలో విష్ణుమూర్తి మాయా విలాసమే మోహిని అవతారం. ఆయన ఈ లోకాన్ని నడిపించే స్థితికారుడు. మరి ఈ లోకం నిజమే అన్న భ్రాంతిలో జీవులు మనుగడ సాగించాలంటే 'మాయ' ఉండాల్సిందే కదా! ఆ మాయకు ప్రతిరూపమే మోహిని! ఈరోజు న స్వామి వారు "మోహన నరసింహుడై"





మనకు దర్శన మిస్తున్నారు. ఈ అవతారపు మూలాలు క్షీరసాగరమథనంలోనే కనిపిస్తాయి. రాక్షసులకు అమృతం దక్కకుండా, వారి దృష్టిని మరల్చేందుకు విష్ణుమూర్తి దాల్చిన రూపే 'మోహిని'. ఆ మోహిని మాయలో పడిన రాక్షసులు అమృతాన్ని సైతం పోగొటు కుంటారు. ఈ కథ వెనుక జీవితపు సత్యం కూడా గోచరిస్తుంది. క్షీరసాగరమథనాన్ని సంసారపు జంఝాటాలతో పోలుస్తారు. ఇందులో మోహానికి కనుక లోబడిపోతే, మనిషిలోని తామస తత్వం రాక్షస స్థాయికి దిగజారిపోతుంది. ఆ మోహాన్ని దాటుకుంటేనే జన్మ రాహిత్యం అనే అమృతం దక్కేది. మోహినీ అవతారం క్షీరసాగరమథనంలోనే కాకుండా ఇతర సందర్భాలలో కూడా ప్రస్తావన వస్తుంది. భస్మాసురుడనే రాక్షసుని మోహితుడిగా చేసి, తన చేత్తో తనే భస్మమయ్యేట్లుగా చేస్తుంది మోహిని. ఆనాటి మోహిని అవతారం లో స్వామి ఎలావుండే వారో, నేడు మోహిని అలంకార సేవలో "మోహన నరసింహుడై" భక్తులకు దర్శనమిచ్చి, ప్రాపంచిక కోరికలు అనబడే మాయకు గురికాకూడదని ఈ అవతారం భక్తులను జాగృతి పరుస్తున్నది. ఈ రోజున స్వామి వారు ,తిరు మాడ వీదులే కాకుండా,ఖాద్రి క్షేత్ర పరిసరాల్లో గ్రామ సందర్శన చేసి,భక్తుల ఇంటి వద్ద ఆస్థాన పూజ లందుకొని,వారి ఆతిథ్యం స్వీకరించి వారికి కరుణా కటాక్షాలను ప్రసాదించి, భక్తులు మాత్రమె భగవంతుని దగ్గరకు కాదు, అర్ధరాత్రి, అపరాత్రి తేడాలేదు ఎప్పుడైనా స్వామి భక్తుల ఇంటికే వొచ్చి అనుగ్రహిస్తారు అని ఈ మోహిని అలంకార పల్లకీ ఉత్సవం తెలుపుతోంది. శ్రీవారిని విశేష మృదంగా వాద్యముల కీర్తనలతో చతుర్ మాడ వీధుల్లో ఊరేగే దివ్య దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించారు.



సజావుగా ముగిసిన టెంకాయల వేలం

- రూ.11.65 లక్షలకు దక్కించుకున్న కర్ణకంటి శ్రీనివాసులు



సింహాద్రిపురం - సూర్య వాస్తవం: సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులోని శ్రీ అంకాలమ్మ దేవస్థానంలో టెంకాయల విక్రయానికి సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం పాట శనివారం సజావుగా ముగిసింది. అంకాలమ్మ గూడూరులోని ఆలయ కళ్యాణ మండపంలో ఉదయం 8:00 గంటల నుంచి ప్రారంభమైన ఈ వేలం ప్రక్రియలో భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ వేలంలో కర్ణకంటి శ్రీనివాసులు అత్యధికంగా రూ. 11,65,000 (పదకొండు లక్షల అరవై ఐదు వేల రూపాయలు) పాడి టెంకాయల విక్రయ హక్కులను దక్కించు ఉన్నట్లు ఆలయ నిర్వహకులు తెలియజేశారు.ప్రస్తుతం కొనసాగుతున్న పాత కాంట్రాక్ట్ గడువు మార్చి 10, 2026తో ముగయనున్న నేపథ్యంలో కొత్తగా వేలం దక్కించుకున్న శ్రీనివాసులు మార్చి 11, 2026 నుండి మార్చి 10, 2027 వరకు ఏడాది పాటు దేవస్థానంలో టెంకాయల విక్రయాలు నిర్వహించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇన్‌చార్జ్ ఎస్ఐ ఘన మద్దిలేటి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. వేలం అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- తిరువల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారిలో పాల్గొన్న రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి





రాయదుర్గం - సూర్య వాస్తవం: భారతీయ జనతా పార్టీ కేంద్ర పెద్దల ఆదేశాలతో శనివారం తిరువల్లూరు అసెంబ్లీ నియోజక వర్గంలో కాపు రామచంద్ర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొంటూ... అన్ని రాష్ట్రాలలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టాలని విస్తృత ప్రచారం చేస్తున్నామని కేంద్ర పెద్దల ఆశీస్సులతో పార్టీ బలోపేతానికి శక్తివంచనీయ లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ఐక్యతగా పనిచేసే బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాలలో అధికారం చేపట్టే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మాధవన్ ఆదేశాల మేరకు తిరువళ్లూరులోని బిజెపి జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకులతో కలిసి సమావేశంలో కార్యకర్తలు ఉద్దేశించి ప్రసంగించామన్నారు. ఏఐఏడిఎంకె నేతృత్వంలో ఎన్డీఏ కూటమికి మద్దతు సమీకరిస్తూ సమస్యలను ప్రజలకు వివరిస్తూ ప్రజల మద్దతు కూడబెట్టడానికి, పార్టీ సభ్యత్వాలను కోరమన్నారు. ఎన్నికల్లో విజయాన్ని సాధించడానికి అంకితభావంతో ఐక్యత నిబద్ధతతో ప్రతి కార్యకర్త పనిచేయాలని తిరువల్లూరులో కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కాపు రామచంద్రారెడ్డి కు బిజెపి నాయకులు ఘన సన్మానాలు చేశారు.

టీడీపీ దౌర్జన్యాలు ఆపాలి

- రెడ్ బుక్ అంటూ ప్రజలపై దాడికి పాల్పడితే సహించం...
- మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం - సూర్య వాస్తవం: రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని, పోలీసులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లా పని చేస్తూ ప్రజలపై టిడిపి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడితే చూసిచూడట్లు వ్యవహరించడం దారుణమని మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది దానికి పోలీస్ వ్యవస్థ పత్తాసు పలకడం చానా దారుణం కాబట్టి ఇప్పటికైనా పోలీస్ వ్యవస్థ మారి ప్రజలు పోలీస్ వ్యవస్థ మీద నమ్మకం కలిగేలా ప్రవర్తించాలని ఆయన సూచించారు. ఇదే ప్రభుత్వం ఎల్లవేళలా ఉండదని రాబోవు రోజుల్లో మా ప్రభుత్వం కూడా వస్తుందని వచ్చినప్పుడు దీని కంటే దారుణంగా బదులు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించడం జరిగింది . యువరాజు స్వామి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎంసి హెచ్ రాజ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ సెక్రెటరీ నేమ్ కల్ సర్పంచ్ పరమేశ్వర్, జిల్లా బీసీ సెల్ సెక్రెటరీ హరేసముద్రం లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు మారంపల్లి మరెన్న, కనేకల్ మండలం మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, బొమ్మనహాల్ మండల కన్వీనర్ రామాంజనేయులు, కనేకల్ మండల కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి, తాలూకా మండల స్థాయి అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

